




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 236 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శనివారం 4 జూలై 2026 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE : 236 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 4 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# సందిగ్ధంలో అన్నదాతలు

## రెగ్యులర్ పంటలా - ఆరుతడి పంటలా?

- ఎటూ తేల్చుకోలేని స్థితిలో అన్నదాత
- ఖరీఫ్ సీజన్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్న ఎల్‌నినో
- వర్షాలు కురవకపోవడంతో వరి సాగుకు ఇబ్బందులు
- జిల్లాల్లో తగ్గిన వరి సాగు - వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గుము ఖం పట్టడంతో జలాశయాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటు న్నాయి. ఏ పంటలు సాగుచేయాలో తెలియక రైతులు సతమతం అవుతున్నా రు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం సూచి స్తున్నా అన్నదాతలు మొగ్గు చూపడంలేదు. వరి పండే నేలల్లో ఇతర పంటలు సాగయ్యే అవకాశం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కోరుతున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో జిల్లాల్లో

- మిగతా 2లో



## తీరందాటిన నైరుతి రుతుపవనాలు

- దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా వర్షాలు, వరదలు
- మత్స్యకారులకు ఐఎండీ హైఅలర్ట్?!
- నైరుతి రుతుపవనాలతో దేశవ్యాప్తంగా వర్షాలు
- పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు రావచ్చని ఐఎండీ హెచ్చరిక

- మిగతా 2లో

## విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో

# పవన్ కల్యాణ్ భేటీ

- వివిధ అంశాలపై గవర్నర్ తో ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించిన పవన్
- అంతకుముందు సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశం
- గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై 'ఈగల్' విభాగం నివేదిక సమర్పణ
- సోషల్ మీడియా వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఐజీ వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం నాడు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్ కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఈగల్' విభాగం

- మిగతా 2లో



## వారసత్వ సంపద మీ సొత్తు కాదు

- పాకిస్థాన్‌పై భారత్ ఘాటు వ్యాఖ్యలు
- తక్షశిలలో పాకిస్థాన్ చేపట్టిన పునర్నిర్మాణ పనులపై తీవ్ర వివాదం
- నిబంధనలకు విరుద్ధంగా పనులు ఆపకపోతే ప్రమాద జాబితాలో చేర్చుతామని యునెస్కో హెచ్చరిక
- వారసత్వ సంపద ప్రపంచానిదని, ఏ ఒక్క దేశానిది కాదని స్పష్టం చేసిన భారత్
- తక్షశిలను ప్రపంచ వారసత్వ జాబితా నుంచి తొలగిస్తామని కూడా హెచ్చరించిన యునెస్కో - మిగతా 2లో




## ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు సహకరించాలి

- ఉగ్రవాదానికి మద్దతు ఆపితేనే సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణ: భారత్
- సింధు జలాల ఒప్పందంపై భారత్ కీలక వ్యాఖ్యలు
- ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు పూర్తిగా, శాశ్వతంగా వీడే వరకు ఒప్పందం ఉండదని స్పష్టం
- అఫ్ఘానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడుల్ని కూడా ఖండించిన ప్రభుత్వం

- మిగతా 2లో



## పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం

- పాకిస్థాన్‌లో లోయలో పడిపోయిన ప్రయాణికుల బస్సు
- ప్రమాదంలో కనీసం 40 మంది మృతి, 8 మందికి గాయాలు
- బ్రేకులు ఫెయిల్ కావడం, అధిక ప్రయాణికులే కారణం!

2లో

# గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

- గూగుల్ కంటే కుప్పం ప్రాజెక్టులే ఎక్కువ సంతోషాన్నిచ్చాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- కుప్పంలో రూ.9,322 కోట్ల విలువైన 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన
- అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం
- శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామికవేత్తలు
- దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి హామీ






**పెన్ పవర్ డెస్క్:**"గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, ఇవాళ జరిగిన కార్యక్ర మాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుడుపల్లె మండలం పొగురుపల్లిలో "స్వర్ణ కుప్పం.. పెట్టుబడుల వేదిక" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే పలు కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

- మిగతా 2లో

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

- సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్ పనులకు చంద్రబాబు శ్రీకారం
- ప్రకటన విడుదల చేసిన నారా లోకేశ్
- సీమ దశాబ్దాల కలను నిజం చేస్తూ చారిత్రాత్మక అడుగు వేశామని వ్యాఖ్య
- ఈ ప్రాజెక్టుతో స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలు లభిస్తాయని ధీమా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీని ప్రగతి పథంలో నిలుపుతామన్న లోకేశ్



**పెన్ పవర్ డెస్క్:**రాయలసీమ ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో మరో చారిత్రాత్మక అడుగు పడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేశామని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ రూపురేఖలు మారనున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో విజయనగరంలో జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు పనులను కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద

- మిగతా 2లో



# మోదీ 3 దేశాల టూర్ ఖరారు

- 40ఏళ్లలో తొలిసారి న్యూజిలాండ్‌లో పర్యటన
- జులై 6 నుంచి 11 వరకు ప్రధాని మోదీ విదేశీ పర్యటన
- ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్న పీఎం
- దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి న్యూజిలాండ్‌లలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## 'సవాళ్ల' రాజకీయంలో ప్రజలే సమిధలు!

తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ వర్సెస్ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ మధ్య గురువారం రోజు రోజంతా సవాళ్ల రాజకీయం సాగింది. నువ్వా-నేనా అన్నట్టుగా ఉదయం 8 గంటల నుంచే ఈ హడావుడి .. రాజకీయ విమర్శలు సంచలనం సృష్టించాయి. ఇలా.. ఉదయం నుంచి దాదాపు సాయంత్రం 6 గంటల వరకు సాగిన ఈ రాజకీయ కొట్లాటలో ఇరు పక్షాలు సాధించింది ఏమైనా ఉందా? అనే ప్రశ్న తప్ప మరొకటి లేదు. కానీ, ఈ రాజకీయ యాగీ కారణంగా సాధారణ ప్రజలకు చుక్కలు కనిపించాయి. బంజారాహిల్స్ నుంచి గన్ పార్క్ వరకు.. అసెంబ్లీ నుంచి కంచన్‌బాగ్ దాకా కూడా.. పోలీసులు నిర్బంధాలు విధించారు. ఈ రహదారులపై నిషేధాజ్ఞలు కొనసాగాయి. సాధారణ వాహనాలు, పౌరులను ఈ దారుల్లో నియంత్రించారు. ఫలితంగా విధులకు వెళ్లాల్సిన ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, కళాశాలలకు వెళ్లాల్సిన వారు కూడా తీవ్ర నరకం చవిచూశారు. ప్రత్యామ్నాయ మార్గాలను సూచించేందుకు కూడా సమయం లేకపోవడం, రాజకీయంగా ఒక్కసారిగా ఉద్రిక్తతలు పెరగడంతో పోలీసులు కూడా చేతులు ఎత్తేసిన పరిస్థితి కనిపించింది. ముఖ్యంగా అధికార పక్షం నుంచి మంత్రులే రోడ్డెక్కడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. మరోవైపు బొల్లారం, బోడుప్పల్‌లో టీఆర్ ఎస్ అధ్యక్షురాలు కవిత ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన నిరసన కూడా దీనికి కలిసి వచ్చింది. ఇలా.. మొత్తంగా గురువారం హైదరాబాద్ నగరంలో ప్రజలు అగచాట్లు పడ్డారు.

**భారీ అసహనం..**

ఇటు ప్రభుత్వం, అటు ప్రధాన ప్రతిపక్షం వైఖరిపై సాధారణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. ఎవరికోసం ఈ సవాళ్లు అంటూ.. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా అప్పులపై సవాళ్లు రువ్వుకోవడాన్ని చాలా మంది ఎద్దేవా చేశారు. అధికారంలో ఎవరు ఉన్నా.. అప్పులు చేస్తున్నారని.. తర్వాత దీనిని రాజకీయం చేస్తున్నారని ఓయూ విద్యార్థి సంఘం నాయకులు విమర్శించారు. ఏతా వాతా ఎలా చూసుకున్నా.. సవాళ్ల రాజకీయంలో సాధారణ ప్రజలే సమిధలుగా మారారని అంటున్నారు.

### వారసత్వ సంపద మీ సొత్తు కాదు..

ప్రపంచ వారసత్వ ప్రదేశమైన తక్షశిలలోని రెండు చారిత్రక కట్టడాల వద్ద పాకిస్థాన్ చేపట్టిన పునర్నిర్మాణ పనులపై తీవ్ర దుమారం రేగింది. ఈ వ్యవహారంపై ఐక్యరాజ్యసమితి సాంస్కృతిక విభాగం (యునెస్కో) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, భారత్ కూడా ఘాటుగా స్పందించింది. ఈ అంశంపై న్యూఢిల్లీలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. వారసత్వ సంపద, ముఖ్యంగా యునెస్కో గుర్తించిన ప్రదేశాలు ఏ ఒక్క వ్యక్తికి లేదా దేశానికి చెందినవి కావని స్పష్టం చేశారు. "అవి మొత్తం ప్రపంచానికి చెందినవి. మన వారసత్వాన్ని కాపాడుకోవడం, పరిరక్షిం చడం అందరి సమిష్టి బాధ్యత" అని ఆయన అన్నారు. పురావస్తు కట్టడాల పరిరక్షణ నియమాలను పాకిస్థాన్ ఉల్లంఘిస్తోందన్న నివేదికలపై ఆయన ఈ విధంగా స్పందించారు. పాకిస్థాన్‌లోని ప్రముఖ పత్రిక 'డాన్' కథనం ప్రకారం, తక్షశిలలోని కట్టడాల సమగ్రతను దెబ్బతీసేలా ఉన్న పునర్నిర్మాణ పనులను వెంటనే వెనక్కి తీసుకోవాలని యునెస్కో పాక్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేనిపక్షంలో ఆ ప్రదేశాలను 'ప్రమాదకర జాబితా'లో చేర్చుతామని హెచ్చరించింది. అంతేకాకుండా, అనవసరమైన జోక్యం కారణంగా తక్షశిలను ప్రపంచ వారసత్వ జాబితా నుంచి తొలగించడానికి కూడా వెనుకాడబోమని యునెస్కో స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తక్షశిలలోని మొహ్రా మొరాదు, సిర్కాప్‌లో పంజాబ్ పురావస్తు శాఖ చేపట్టిన పనులపై సమాచారం, చిత్రాలను మూడో పక్షం పారిస్‌లోని పాక్ శాశ్వత ప్రతినిధికి పంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై జూన్ 12న యునెస్కో, పాక్ పురావస్తు శాఖ అధికారులు సంయుక్తంగా తక్షశిలను సందర్శించారు. నిర్మాణాలకు ముందు, తర్వాత తీసిన ఫొటోలు, వినియోగించిన మెటీరియల్‌పై ల్యాబ్ రిపోర్టులు సమర్పించాలని యునెస్కో కోరింది. ప్రపంచ వారసత్వ కట్టడాల పునరుద్ధరణలో సిమెంట్ వాడటం యునెస్కో నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని నిపుణులు చెబుతున్నారు. ఈ వివాదం కారణంగా ప్రపంచ వారసత్వ జాబితాలో మరో 24 ప్రదేశాలను చేర్చాలన్న పాకిస్థాన్ ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది.

### పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం

పాకిస్థాన్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల సరిహద్దులోని షెరనీ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ ప్రయాణికుల బస్సు, దానా సర్ ప్రాంతంలోని పర్వత రహదారిపై ప్రయాణిస్తుండగా ఉదయం 8 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం, బ్రేకులు విఫలం కావడం వల్లే ఈ ఘోరం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదకరమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు ఒక్కసారిగా లోయలోకి దూసుకెళ్లింది. ప్రారంభంలో ఈ బస్సు 36 మంది ప్రయాణికులతో బయలుదేరినప్పటికీ, మార్గమధ్యంలో మొరాయించిన మరో వాహనంలోని ప్రయాణికులను కూడా ఎక్కించుకోవడంతో మొత్తం ప్రయాణికుల సంఖ్య 48కి చేరింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే '1122' అత్యవసర సిబ్బంది, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని జోబ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదంపై బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తీ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించగా, పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

**పెట్టుబడుల కుంభవృష్టి.. ఉద్యోగాల జాతర**

ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం, ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా మారుతోందని చంద్రబాబు అన్నారు. మొత్తం రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 27 పరిశ్రమలు కుప్పంలో కొలువుదీర నున్నాయని ప్రకటించారు. ఫుట్‌వేర్ నుంచి విమానాల తయారీ వరకు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత కంపెనీలు తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌కు సీఎం భూమిపూజ చేశారు. హ్వాసెంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.899 కోట్ల పెట్టుబడితో ఏర్పాట వుతున్న ఈ పరిశ్రమ ద్వారా ఏకంగా 20,145 మందికి ఉపాధి లభించనుంది.

దేశంలోనే తొలి బ్యాటరీ అనోడ్ మెటీరియల్ ప్లాంట్‌కు కుప్పంలో శ్రీకారం చుట్టారు. అథా గ్రూప్ రూ.2,081 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, దీని ద్వారా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏ

వియేషన్ రంగంలోనూ కుప్పం తనదైన ముద్ర వేయనుంది. పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడితో టూ సీటర్ ట్రైనర్ విమానాల తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనివల్ల 1,400 మందికి ఉపాధి దొరుకుతుంది. వీటితో పాటు ఎంఏఎఫ్ క్లోతింగ్ (గార్మెంట్స్), న్యూట్రి ఫీడ్స్ (చికెన్ ప్రాసెసింగ్), ఫామ్ అమినో అగ్రిటెక్ (కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్షన్) వంటి అనేక ఇతర పరిశ్రమల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

**శంకుస్థాపన రోజే ప్రారంభ తేదీలు**

ఈ సందర్భంగా పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతంగా ఉందని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ప్రభుత్వ ప్రోత్సాహం చూశాక, పనులను మరింత వేగంగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలుగుతోందని తెలిపారు. శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలను నిర్దేశించుకుని పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించగా, వారు వేదికపై నుంచే తమ ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించడం విశేషం. అనంతరం ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం, వారి ఉత్పత్తులు, పనితీరు గురించి ఆరా తీశారు.

**కుప్పం నా బాధ్యత.. అభివృద్ధి నా ఆశయం**

ఈ సభలో ప్రసంగించిన చంద్రబాబు, కుప్పం ప్రజలు తనను 8వ సారి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి దీవెనలే తనకు శ్రీరామరక్ష అని అన్నారు. "నేను ఎక్కడున్నా నా ఆలోచనలు కుప్పం మీదే ఉంటాయి. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేయాలన్నది నా కోరిక. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి, అందులో కుప్పం ముందుండాలి," అని ఆయన ఆకాంక్షించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతను అందించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని అడ్డుకునే వారి తోకలు కత్తిరిస్తానని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలతో పాటు, ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం, బీసీ, ఓసీ కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు, పరిశ్రమల కోసం విద్యుత్ సబ్‌స్టేషన్లు, హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ వంటి పలు అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

- మొదటి పేజి తరువాయి

2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్, 350 మెగావాట్ల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ప్లాంట్ పనులకు ఇవాళ సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టడం తెలిసిందే. దీనిపై లోకేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాయలసీమ ప్రాంతం ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నిలపాలన్న కూటమి ప్రజా ప్రభుత్వ ఉక్కు సంకల్పానికి ఈ స్టీల్

ప్లాంట్ నిదర్శనమని లోకేశ్ అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలో నిలుపుతామని ఆయన స్పష్టం చేశారు.

# మోదీ 3 దేశాల టూర్ ఖరారు

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించను న్నారు. ఈ 3 దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మోదీ ఈ పర్యటన చేయనున్నా రని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం వెల్లడిం చింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మొదట ఇండోనేషియాను సందర్శిస్తారు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు ప్రయాణమవుతారు. అక్కడ ఆయన ప్రధాన అధికారిక కార్యక్రమాలు మెల్‌బోర్న్‌లో జరుగుతాయి. అనంతరం న్యూజిలాండ్‌కు వెళ్లి తన పర్యటనను ముగిస్తారని ఎంఈఏ కార్యదర్శి (ఈస్ట్) రుద్రేంద్ర టాండన్ తెలిపారు.

**40 ఏళ్లలో మొదటిసారి**

ప్రధాని మోదీ న్యూజిలాండ్ పర్యటన ఎంతో ప్రత్యేకమైనది. దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి ఆ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వచ్చేవారం ప్రధాని మోదీ న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నట్లు ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ఈ రోజు ఉదయం అధికారికంగా ప్రకటించారు. "భారత ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారం న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నారని ప్రకటించడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను" అని లక్సన్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే ఈ పర్యటన గురించి కచ్చితమైన తేదీలను ఆయన వెల్లడించలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి

చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటి అని కొనియాడిన లక్సన్, న్యూజిలాండ్ ఆర్థిక శ్రేయస్సుకు భారత్ ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. "ఏప్రిల్‌లో కుదిరిన 'న్యూజిలాండ్-ఇండియా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్' (ఎఫ్‌టీఏ) ద్వారా ఇరుదేశాల మధ్య సంబంధాలను మేము తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. ఇది న్యూజిలాండ్?కు మరిన్ని ఉద్యోగాలను, అధిక ఎగుమతులను, బలమైన ఆర్థిక వృద్ధిని అందిస్తుంది" అని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని, న్యూజిలాండ్ వస్తు, సేవలకు 1.4 బిలియన్ల (140 కోట్ల) జనాభా కలిగిన భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తుందని లక్సన్ అన్నారు. ఇది కివి (న్యూజిలాండ్) సమాజంలోకి మరింత ఆదాయాన్ని తీసుకువస్తుందని చెప్పారు.

# తీరందాటిన నైరుతి రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తాజా అల్పపీడన ప్రభావంతోపాటు, ఇతర వాతావరణ పరిస్థితుల వల్ల రానున్న వారం రోజుల్లో దేశవ్యాప్తంగా, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. సున్నితమైన ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడడం, ఉరుములతో కూడిన గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

**ఏపీ, తెలంగాణలో విస్తారంగా వర్షాలు**

ఐఎండీ ప్రకారం, ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కొనసాగుతున్నాయి. కేరళ, కర్ణాటక, తెలంగాణ, తీరప్రాంత ఆంధ్రప్రదేశ్?, తమిళనాడు, పుదుచ్చేరి, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న వారం రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. కేరళ, కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తాయి. తెలంగాణ, రాయలసీమలో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

**మత్స్యకారులకు హై అలర్ట్**

బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో గంటకు 45-55 కి.మీ వేగంతో, గరిష్ఠంగా 65 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. అందువల్ల గుజరాత్, కొంకణ్, గోవా, కర్ణాటక, కేరళ, లక్షద్వీప్, ఒడిశా, బెంగాల్,

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని ఐఎండీ హెచ్చరించింది. తీరప్రాంత ప్రజలు అధికారుల హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ అప్రమత్తం గా ఉండాలని అధికారులు కోరారు. ఈ వర్షాలు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించి వ్యవసాయ పనులకు ఊతం ఇచ్చినప్పటికీ, సున్నితమైన ప్రాంతాల్లో వరదలు, ప్రకృతి విపత్తులకు దారితీసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

# ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు సహకరించాలి

సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఉగ్రవాద కార్యకలాపాలకు శాశ్వతంగా మద్దతు నిలిపివేసే వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని భారత్ పునరుద్ఘాటించింది. అదే సమయంలో అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడుల్ని కూడా తీవ్రంగా ఖండించింది. ఆ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళనకరం అని పేర్కొంది. దిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ విషయాల్ని వెల్లడించారు. సింధు జలాల ఒప్పందంపై భారత వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

'పాకిస్థాన్ నిరంతరం సరిహద్దు దాటి ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోంది. అందుకే సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. పాకిస్థాన్ నమ్మదగిన రీతిలో, శాశ్వతంగా ఉగ్రవాదానికి మద్దతు పూర్తిగా విరమించుకోవాలి. అప్పటి వరకు మా వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదు' అని జైస్వాల్ తెలిపారు. ఇటీవల భారత్-జపాన్ ప్రధానుల సమావేశంలో కూడా ఉగ్రవాదంపై ఇరు దేశాలు ఒకే స్వరంతో స్పందించిన

విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయే తకైచి సమావేశం అనంతరం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పాకిస్థాన్ నుంచి పుట్టుకొస్తున్న సరిహద్దు ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ ప్రకటనలో ఐక్యరాజ్యసమితి నిషేధిత ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా (ఎల్ఈటీ), జైషే మహ్మద్ (జేఈఎం), అల్ ఖైదా, ఐసిస్ వంటి సంస్థలపై ప్రపంచ దేశాలు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే స్థావరాల్ని పూర్తిగా నిర్మూలించడం, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే వ్యవస్థల్ని ధ్వంసం చేయడం, సరిహద్దుల మీదుగా ఉగ్రవాదుల రాకపోకల్ని పూర్తిగా అడ్డుకోవాలని భారత్- జపాన్ పేర్కొన్నాయి.

## విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

- మొదటి పేజి తరువాయి

క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు. అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

## రైతు భరోసా నిధుల విడుదలలో మరోసారి రేవంత్ ప్రభుత్వం రికార్డు

-మొదటిపేజీ తరువాయి

ఈ విడతలో 4.41 లక్షల మంది రైతులు రైతుభరోసా సాయాన్ని పొందారని మంత్రి తెలిపారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ఇప్పటికే మొదటి మూడు విడతలలో 4 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు విడుదల చేయగా, ఈ రోజు 4 నుండి 5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా సాయం అందించమన్నారు. ఇప్పటివరకు రైతుభరోసా పథకం కింద మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.5402.37 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

## సందిగ్ధంలో అన్నదాతలు

-మొదటిపేజీ తరువాయి

వానాకాలం సాగు సందిగ్ధంలో పడింది. కనీసం పది శాతం వరకు కూడా విత్తనాలు పడలేదు. జలాశయాల్లో నీటినిల్వలు సరిపడా లేకపోవడంతో వరిసాగుకు నీరందే పరిస్థితి లేదు. బావులు, బోరుబావుల్లో నీరు అంతంత మాత్రమే ఉండటంతో పంటలు వేయాలా వద్దా అని అన్నదాతలు సందిగ్ధంలో ఉన్నారు. ఇప్పటికే వరినార్లు పోసి, పత్తి విత్తనాలు నాటినా వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. "ప్రభుత్వం సన్నరకాల ధాన్యాలు సాగు చేయాలని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెబుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సాధ్యం కావట్లేదు. అధికారులు సన్నాలు వేయమని చెప్పారు. ఇప్పటికే సమయం అయిపోయింది. ఇప్పుడు విత్తనాలు నాటితే పంటపై ప్రభావం పడుతుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల నీరు కూడా లేవు. వరి బదులుగా ప్రత్యామ్నాయ పంటలకు మళ్లాలని అధికారులు చెబుతున్నారు. వర్షాలు ఎక్కువైనట్లయితే ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలంగా ఉండదు. సన్నవడ్లపై రూ.500 అదనంగా ఇస్తామని చెబుతున్నారు. అవి మాకు ఎంతమాత్రం గిట్టుబాటు కావడం లేదు. ఈ సన్నరకాల్లో 15 క్వింటాళ్ల కంటే అధిక దిగుబడి రావట్లేదు"

**అరుతడి పంటలే మేలు**

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు వేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నా రైతుల్లో స్పందన లేదు. వరిసాగుచేసిన భూముల్లో ముఖ్యంగా నల్లరేగడి నేలలో ఇతర పంటల సాగుకు యోగ్యంకాదని రైతులు చెబుతున్నారు. సన్నరకాల వరి పండించేందుకు కర్షకులు మొగ్గు చూపుతున్నారు. వరి తర్వాత అధికంగా పత్తిని రైతులు సాగుచేసేవారు. రెండు లక్షల సాధారణ సాగు విస్తీర్ణానికి ప్రస్తుతం లక్షఎకరాల్లో వేశారు. భవిష్యత్‌లో వర్షభావ పరిస్థితులు తీవ్రమైతే రైతులు నష్టపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. "వర్షాభావ పరిస్థితుల వల్ల వరి పంటకు బదులుగా పప్పుదినులు, జొన్న, రాగి, సజ్జ లాంటి పంటలు సాగు చేయాల్సిందిగా రైతులకు సూచించాం. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డబ్ల్యూజీఎల్44, కేఎన్ఎం 7715, తెలంగాణ సోనా లాంటి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగింది. నారు పోసుకునే రైతులు ముఖ్యంగా స్వల్పకాలిక సన్నరకాల వరి విత్తనాలను మాత్రమే సాగు చేయాలని సూచిస్తున్నాం" స్వల్పకాలిక పంటలపై రైతులకు అవగాహన : స్వల్పకాలిక, ఆరుతడి పంటలపై రైతువేదికల ద్వారా అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నామని అధికారులు వివరించారు. ప్రభుత్వం సూచించినట్లుగా ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గుచూపితేనే ఎల్‌నినో ప్రభావం, నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# వడ్డీల పేట రామాలయంకి లక్ష రూపాయలు విరాళం..



**జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి దొర..**

**కోరుకొండ ,పెన్ పవర్, జులై 3:**కోరుకొండ వడ్డీల పేటలో నూతనంగా నిర్మించిన రామాలయానికి ఉత్సవ విగ్రహాలు 50 వేల రూపాయలు, ఆలయ నిర్మాణానికి 50 వేల రూపాయలు మొత్తం లక్ష రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బదిరెడ్డి దొరకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి




జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 3 :**ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ--2026 (ఎస్ఐఆర్) కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వెలగపూడి నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.


ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఎన్నికల విభాగం అధికారులు కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు ఓటర్ల నమోదు ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 38.98 శాతం పూర్తయిందన్నారు. ప్రతిరోజూ 75 వేల నుంచి 80 వేల వరకు ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేస్తున్నామని తెలిపారు.

అనపర్తి నియోజకవర్గంలో 44.57 శాతం, మండపేటలో 58.41 శాతం, రాజానగరంలో 39.05 శాతం, రాజమహేం ద్రవరం సిటీలో 23.19 శాతం, రాజమహేంద్రవరం రూరల్‌లో 30.33 శాతం, కొవ్వూరులో 42.83 శాతం, నిడదవోలులో 41.34 శాతం, గోపాలపురంలో 38 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని వివరించారు.

రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో డిజిటలైజేషన్ పురోగతి 15 శాతం కంటే తక్కువగా ఉన్న 68 పోలింగ్ కేంద్రాలను, 10 శాతం కంటే తక్కువ పురోగతి నమోదైన 13 పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా గుర్తించామని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు.

ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఆశించిన స్థాయిలో పురోగతి చూపని ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరును పోలింగ్ కేంద్రాల వారీగా ప్రతిరోజూ సమీక్షిస్తున్నామని, అవసరమైన చోట అదనపు సిబ్బందిని వినియోగిస్తూ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి మూడు నాలుగు రోజులకు ఒకసారి సమావేశాలు నిర్వహిస్తూ పురోగతిని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

# జిల్లాలో 'ప్రాజెక్ట్ మాతృ' పథకం పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలి



**-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

**ఏలూరు, జూలై 3 పెన్ పవర్:** జిల్లాలో 'ప్రాజెక్ట్ మాతృ' పథకం పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.స్థానిక కలెక్టరేట్ నుండి శుక్రవారం 'ప్రాజెక్ట్ మాతృ' పథకం అమలుపై అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గర్భిణీ, బాలింతల ఆరోగ్య పరిరక్షణ 'ప్రాజెక్ట్ మాతృ' పథకం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో ఎక్కడా ఏ గర్భిణీ, బాలింత కూడా పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి వారికీ గురికాకుండా చూడాలన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం లేకుండా వారికీ అవసరమైన పౌష్టికాహారం, తృణధాన్యాలు , పళ్ళు, వారికి ఆరోగ్య పరిస్థితులకు అవసరమైన ఔషధాలను వారానికి ఒకసారి అందించేలా ఏర్పాటు చేయాలన్నారు. అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎం లు తమ పరిధిలోని గర్భిణీ ల ఆరోగ్య పరిరక్షణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, గర్భం దాల్చిన ప్రసవం వరకు దగ్గరనుండి ఆరోగ్యపరీక్షలు నిర్వహించి, ఏదైనా అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుట్టిన ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. జిల్లాలో మాతా, శిశు మరణాలు సంబవించకుండా ఐసిడిఎస్, వైద్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలోని గర్భిణీ, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.శోభ , ఐసిడిఎస్ పి .శారద, జిల్లాలోని వివిధ ప్రాంతీయ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



**సీతానగరం, పెన్ పవర్, జూలై 03:** రాజానగరం నియోజకవర్గ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పురుషోత్తపట్నం తొర్రిగడ్డ పంపింగ్ స్కీము ద్వారా సాగునీటి విడుదల కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మరియు రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్విచ్ ఆన్ చేసి సాగునీటిని అధికారికంగా విడుదల చేశారు. ఈ నీటి విడుదలతో కోరుకొండ, సీతానగరం మండలాల్లో సుమారు 20,000 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనున్నది. దీంతో పంట పొలాలు జలకళ సంతరించుకుని, రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అన్నదాతలు ఇబ్బందులు పడకుండా సమయానికి సాగునీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రైతుల అభ్యున్నతికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం చేపడుతుందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగుతుందని అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బల రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధికి ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు ఆధునీకరణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని హామీ ఇచ్చారు. రైతులు తొర్రగడ్డ పంపింగ్ స్కీము సాగునీటి ద్వారా అధిక దిగుబడును సాధించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో తొర్రగడ్డ చైర్మన్ వేగి శ్రీనివాస్, కూటమి నాయకులు గద్దె వెంకటకృష్ణ చౌదరి, నీరుకొండ శివ, సంగన చిన పోసియ్య, పుక్కల శీను, గద్దె నాని, మండా రాంబాబు, సొసైటీ చైర్మన్లు కాంద్రు శేఖర్, మద్దిపాటి సూజీరాజు, ఇరిగేషన్ ఏఈ డిఈ తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మురికి నీరు ఎటు పోవాలి...



**-డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం**
**-గ్రామపంచాయతీ ఎదురుగా నిలిచిన డ్రైనేజీ**
**-దుర్వాసనతో అవస్థలు పడుతున్న ప్రజలు**

**కూనవరం,పెన్ పవర్,జూలై3.** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఎదురుగా మురికి నీరు దర్శనమిస్తుంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో నీరు ఎటు పోకుండా ఒకే చోట నిలిచిపోయి దుర్వాసన వస్తుంది.అటుగా వెళుతున్న ప్రజలు,చుట్టుపక్కల నివసించేవారు దుర్వాసనతో ముక్కు మూసుకుని దుస్థితి నెలకుంది.పంచాయతీ అధికారులు నిత్యం మురికి నీరు దర్శనమిస్తున్న ఏమి పట్టనట్లుగా ఉండడం గమనార్హం.అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రజలకు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.విచిత్ర మేంటంటే అధికారులు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండాలని తద్వారా డెంగ్యూ,మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు దరి చేరవని ప్రచారం చేసే అధికారులే, కార్యాలయం ఎదుట నిలిచిన మురికి నీటిని పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.పంచాయతీ అధికారులు ప్రతినిత్యం అటుగా తిరుగుతున్న ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని,ఎన్నిసార్లు అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు.మురుకు నీరు వాసనతో చుట్టుపక్కల ఇల్లు, అటుగా తిరుగుతున్న ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది.ఇప్పటికైనా పంచాయతీ అధికారులు తక్షణం స్పందించి డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఈఏపీసెట్‌లో నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**పెన్ పవర్ -- ఉంగుటూరు । జులై 03**

17 మంది విద్యార్థులు అర్హత సాధింపు




ఉంగుటూరు మండలంలోని నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈఏపీసెట్--2026లో ప్రతిభ కనబరిచారు. ఇంజినీరింగ్ విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్షలో కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు అర్హత సాధించారు.

గ్రామీణ ప్రాంత ప్రభుత్వ కళాశాల నుంచి ఒకేసారి ఇంతమంది విద్యార్థులు ఈఏపీసెట్‌లో అర్హత సాధించడం విశేషమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఆర్. ప్రభాకరరావు అభినందించారు. విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బెజడం వెంకట శ్రీనివాస్ అభినందిస్తూ, ఎలాంటి ప్రత్యేక కోచింగ్ లేకుండానే ప్రభుత్వం అందించిన ఉచిత పాఠ్యపుస్తకాలు, అధ్యాపకుల బోధనతోనే ఈ విజయం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.

అర్హత సాధించిన వారిలో ఉద్దండ లక్ష్మీ ప్రసాద్, జి. గౌతమ్, కె. సిరిమాధురి, హెచ్‌డీవీఎల్ శ్రావ్య, పి. దుర్గా భవాని, పి. నాగరాజు తదితరులు మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. వీరిలో పలువురికి జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు లభించే అవకాశం ఉందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బెజడం వెంకట శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.




# రూ. 3.98 కోట్లతో రోడ్, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ జూలై 3** వార్డుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా పుష్కరాల నాటికి నగర నగరాన్ని అభివృద్ధి చేస్తామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం 20వ డివిజన్ లో గూడ్స్ గేట్ చర్చి వద్ద , ఐ.ఎల్.టి.డి ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ నుండి రైల్వే ట్రాక్ వరకు రూ.1.98 కోట్ల తో నూతనంగా నిర్మించే స్టార్మ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. 16వ డివిజన్ లో రైల్వే కోల్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఈస్ట్ రైల్వే స్టేషన్ బిటి రోడ్డు ను వెడల్పు చేయుటకు రూ .2 కోట్లతో నూతనంగా నిర్మించే పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసారు.

ముంపు ప్రాంతాలను కమిషనర్, ఎమ్మెల్యే, అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ వర్షపు నీరు, మురుగునీరు పారేందుకు శాశ్వత పరిష్కారం గా రూ.1.98 కోట్ల తో గూడ్స్ గేట్ షెడ్డు వద్ద నుండి ఐ ఎల్ టి డి జంక్షన్ ఫ్లై ఓవర్ వరకు డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నా మన్నారు .ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు ను విస్తరణ పనులు చేసేందుకు రూ.2 కోట్లతో శంకుస్థాపన చేశామన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు విస్తృత స్థాయిలో అభివృద్ధి అమలు చేస్తున్నామని తెలిపారు.

స్థానికంగా కల్వర్టు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, నిమ్మలపూడి గోవిందు, వడ్డీ వరప్రసాద్, నమ్మి శేఖర్, శీలం గోవిందు, రొంపిచర్ల అంటోని, మజ్జి శ్రీను, చలమూరి సత్యనారాయణ, ఏడాకుల వెంకటేశ్వరరావు, కుంచె హనుమంతరావు, సూపరింటెండింగ్ ఇంజనీర్ రీటా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కాసా సత్యనారాయణ, లోవరాజు, పెన్నమరెడ్డి ఈశ్వరుడు, అడ్డాల శ్రీను, కురుకూరి కిషోర్, మద్దా మణి, పిల్ల తనుజ, గంగిన జాహ్నవి, సుబ్బయమ్మ, చిట్టిబోయిన శ్రీనివాస్, కక్కల రమేష్, అర్జీల లక్ష్మణరావు, ఎంఎంఎల్ రాజు, అడప వరప్రసాద్, ఆళ్ల ఆనందరావు, పుక్కల్ల రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యల రహిత నియోజకవర్గం గా ఏలూరును తీర్చిదిద్దేందుకు కృషి

-ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడి

ఏలూరు జూలై 3 పెన్ పవర్ : సమస్యల రహిత నియోజకవర్గం గా ఏలూరును తీర్చిదిద్దేందుకు అహర్నిశలు పాటుపడుతున్నామని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ అధినేతల ఆలోచన మేరకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం కూడా ఎంతో స్ఫూర్తివంతంగా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా తిష్ట వేసిన అనేక జటిలమైన సమస్యలకు సైతం మునిపెన్నడూ లేని విధంగా శాశ్వత పరిష్కార మార్గాలు చూపుతూ ప్రజల్లో భరోసా నింపుచున్నామని ఆయన వెల్లడించారు. ప్రతి శుక్రవారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుండి వినతులు, అర్జీలు స్వీకరించి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నారు. ఈ విషయంలో ప్రజల్లో భరోసాను, ధైర్యాన్ని నింపేలా బాధ్యతాయుతంగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. పోణంగి లో టీడ్కో ఇళ్ల నిమిత్తం గతంలో డీడీలు కట్టిన వారికి ఆ సొమ్ములను వెనక్కి చెల్లించే ప్రక్రియను కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్ది బోయిన శివప్రసాద్, డిప్యూటీ మేయర్ కర్రి శ్రీనివాస్, టిడిపి నగర అధ్యక్షుడు చౌడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, నాయకులు లంకపల్లి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎస్వీ రంగారావు 108 వ జయంతి సభ

* పేదలకు చీరలు, పంచెలు పంపిణీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 3 :** చలనచిత్ర రంగంలో చిరస్థాయిగా నిలిచే మహానటుడు ఎస్వీ రంగారావు అని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. 54 సంవత్సరాల వయసులో బహుభాషల్లో 300 చిత్రాలు పైగా నటించిన సహజ నటుడు ఎస్వి ఆర్ అన్నారు. పంతం చారిటబుల్ ట్రస్ట్, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్, ఎస్ వి ఆర్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గోదావరి గట్టు ఎస్వీ రంగారావు విగ్రహం వద్ద 108 జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షుడు పంతం కొండలరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో రౌతు మాట్లాడుతూ, ఎస్ వి ఆర్ నటించిన ఆనాటి చిత్రాలను ప్రధానమంత్రి వంటి వారు తిలకించి తిలకించి ఆయన నటన కౌసల్యాన్ని ప్రశంసించే వారన్నారు. ఆయన సహజ నటనకు ఎన్నో అంతర్జాతీయ స్థాయి అవార్డులు వచ్చయన్నారు. వైసిపి కేంద్ర కమిటీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ, అన్ని వర్గాలతో కలిసి ఎస్ వి ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఆనాటి నాటక కళా పరిషత్తుల సినిమా సినిమాల్లో అవకాశాలు లభించిన వారిలో ఎస్వీఆర్ ఒకరన్నారు. పంతం కొండలరావు మాట్లాడుతూ, ఎస్వి రంగారావు నటన వైభవం తిలకించేవారికి సమాజంలో జరుగుతుందా అనేంత సహజంగా ఉండేదన్నారు. ఆయన నగర సమీప ధవళేశ్వరం గ్రామ వాస్తవ్యుడు కావడం జిల్లా ప్రజలకు గర్వకారణం అన్నారు. తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు మాట్లాడుతూ, ప్రస్తుత మెరక వీధి ఉల్లిపాయలు మార్కెట్ వద్ద ఆయన మేనమామ ఇల్లు ఉండేదని, కాకినాడలో డిగ్రీ విద్య అనంతరం ఉద్యోగం వచ్చిందని, అదే సమయంలో సినిమాల్లో ఆకాశం వచ్చిందని ఆయన తొలి సినిమా సరోజిని చిత్రం అన్నారు. కొంత కాలం పాటు చిత్రాలు విజయవంతం కాకపోవడంతో అనంతరం మళ్ళీ ఉద్యోగంలో చేరారని, నాటక పరిషత్తులో నటించేవారన్నారు. ఆ తర్వాత మళ్లీ సినిమాల్లో అవకాశాలు లభించడంతో వెనుతిరిగి చూడకుండా 300 చిత్రాల్లో, బహుభాషల్లో ఎన్నో సహజ పాత్రలు నటించారని అన్నారు. ఆయనకు సేవ గుణం కూడా ఉండడంతో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. తొలుత హాజరైన నాయకులు ఎస్వి ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు చీరలు, పంచలు పంపిణీ చేశారు. ఇంకా ఈ సభలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు చల్లా శంకర్రావు, ఆకుల వీర్రాజు, అయ్యల గోపి, ఎనుముల రంగబాబు, టీ కే విశ్వేశ్వర రెడ్డి, కొత్తపేట రాజా, దేశి రెడ్డి బలరామ నాయుడు, రంకి రెడ్డి సుబ్బరాజు, మానె దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ కన్వీనర్ గా తలారి సతీష్



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,జులై 3 ;** పోలవరం నియోజకవర్గం లోని దళితుల హక్కుల పరిరక్షణ కొరకు తన వంతు కృషి చేస్తానని పోలవరం నియోజకవర్గం మాల మహానాడు కన్వీనర్ తలారి సతీష్ అన్నారు. శుక్రవారం జీలుగుమిల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏడు మండలాలలో మాల మహానాడు బలోపేతానికి రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు నల్లి రాజేష్ ఆధ్వర్యంలో కృషి చేస్తానని అన్నారు. ప్రతి పంచాయతీలలో మాల మహానాడు బలోపేతం చేసి దళితుల హక్కుల కొరకు కృషి చేస్తానని అన్నారు. దళితుల మేధావులు, మాల మహానాడు ప్రతినిధులు, అంబేద్కర్ యూత్ సంఘాలు సహకారాలతో ముందుకు వెళతానని అన్నారు. నియోజకవర్గ కన్వీనర్ గా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ కి అభినందనలు తెలిపారు. జీలుగుమిల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బొంతు రామారావు తలారి సతీష్ కి అభినందనలు తెలిపారు.

## ఏలూరు జిల్లా డిపిఆర్ఓ గా దుర్గాప్రసాద్

**ఏలూరు జూలై 3 పెన్ పవర్ :** ఏలూరు జిల్లా డిపిఆర్ఓ గా దుర్గాప్రసాద్ పదోన్నతి పొందారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ, సమాచార శాఖ ద్వారా పాత్రికేయులకు సమాచారం అందిస్తూ పలు జిల్లా అధికారుల నుండి, పాత్రికేయ సంఘాల నుండి ప్రశంసలు అందుకున్నారు. ఏలూరు డిపిఆర్ఓ గా పదోన్నతి పొందిన దుర్గాప్రసాద్ సమాచార శాఖ ఉద్యోగులు ప్రశంసిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా తరపున నాయకులు, పలువురు జర్నలిస్టులు శు



భాకాంక్షలు తెలిపారు.

## పారిశుద్ధ్య మెరుగుకు పటిష్ట చర్యలు

* కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 3 :** నగర పరిశుభ్రతను మెరుగుపరిచేలా.. పారిశుద్ధ్య చర్యలను మరింత పటిష్టపరచాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. శుక్రవారం ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి లాలాచెరువు పరిసర ప్రాంతాలలో పర్యటించి.. పారిశుద్ధ్య చర్యలను తనిఖీ చేశారు. కాలువల్లో మురుగునీరు సజావుగా సాగేలా డీసిల్టేషన్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ జైలు మెయిన్ గేటు వద్ద తరచూ డ్రెయిన్ బ్లాక్ కాకుండా ఒక మ్యాన్ హోల్ ను ఏర్పాటు చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నగరంలోని పశువుల యజమానులు చుట్టుప్రక్కల నివాసితులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని.. ఆవులు, ఇతర పశువులు రోడ్లపైకి రాకుండా కాంపౌండ్ వాల్ ను కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా 8వ వార్డులో విచ్చలవిడిగా పశువులను రోడ్ల మీదకు వదలడం వల్ల వాహనాల రాకపోకలకు ఆటంకంగా, ప్రమాదాలకు కారణం అవుతున్నా యన్నారు. డివైడర్ల వద్ద గ్రీనరీ కూడా దెబ్బతింటోందన్నారు. వార్డు సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు కూడా తమ తమ సచివాలయాల పరిధిలో రోడ్లపైకి ఆవులు, గేదెలు తిరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

## తెదేపా సీనియర్ నేత మడకం నాగమ్మ మృతి



* కుటుంబానికి 5వేలు ఆర్థిక సాయం

**కూనవరం,పెన్ పవర్,జూలై3.** మండలంలో రేగులపాడు గ్రామానికి చెందిన తెదేపా పార్టీ సీనియర్ నాయకురాలు మడకం నాగమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించింది.పార్టీ తరపున ఆమె కుటుంబ సభ్యులకు మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు, మండల ప్రధాన కార్యదర్శి పోడియం అప్పారావు నేతృత్వంలో పార్టీ నాయకులు 5వేలు ఆర్థిక సాయం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి మడకం నాగమ్మ చేసిన సేవలను కొనియాడారు.ఆమె కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బోడ వెంకటేశ్వర్లు, రాము,కుంజ వెంకటేష్,బొగ్గ ముత్తయ్య,బొగ్గ నాగిరెడ్డి,సోడే వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## పెత్తందారి రాజకీయాలకు చెక్



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,జులై 3 ;** నేటితో పోలవరం నియోజకవర్గంలో పెత్తందారీ రాజకీయాలకు చెక్ పడుతుంది ,ఒకరిద్దరూ ఆధిపత్యానికి ,కుటుంబ రాజకీయాలకు, బెదిరింపుల రాజకీయాలకు ఇక ప్రజలు ముగింపు పలుకుతున్నారు అని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం బరంకులపాడు క్యాంప్ కార్యాలయం నుండి జంగారెడ్డిగూడెం వై జంక్షన్ మీదుగా ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయం కి జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీల దరఖాస్తుల కార్యక్రమానికి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్త నాయకుడు అనే భావనతో జనసేన పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. ప్రజలే మా బలం కార్యకర్తలే మా ఆస్తి ప్రజాస్వామ్య విలువలే మా సిద్ధాంతం అని సూచించారు .రానున్న రోజుల్లో జనసేన పార్టీ మరింత బలంగా పుంజుకుంటున్న అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వీర మహిళలు, యువజన నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తా ఎంపీడీఓ గోవింద్



**గోకవరం పెన్ పవర్ జులై 03:-** గోకవరం మండలం మేజర్ పంచాయతీపరిధిలోని సంజీవ్ నగర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యపై మండల ప్రజాపరిషత్ అధికారి వెంటనే స్పందించారు స్థానికులు త్రాగునీటి సమస్యపై ఎదుర్కొంటున్న ఇబ్బందుల పై ఆయన సంజీవ్ నగర్ కాలనీకి చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడిన ఎంపీడీవో గోవింద్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంజీవయ్య నగర్ కాలనీలో ఉన్న త్రాగునీటి సమస్య పై నిరంతరం స్పందిస్తూ సమస్య పరిష్కారానికి అధికారులకు అనేకసార్లు వినతి పత్రం అందజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న మండలం బిజెపి అధ్యక్షులు ఇనుకోటి బాపన్న దొర ను స్థానికులు అభినందిస్తున్నారు ఈ సందర్భంగా ఇనకోటి దొర మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులతో వెంటనే సమన్వయం చేసి, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం శుభ పరిణామమని కాలనీలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న సమస్యపై స్పందించి పరిష్కారానికి చర్యలు చేపడతానని భరోసా ఇవ్వడంతో ఎంపీడీవో గోవింద్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు ఇలాగే ప్రజా సమస్యలపై వేగంగా స్పందించి పరిష్కారం చూపాలని స్థానికు ప్రజలు కోరుతున్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తోలేటి రాంప్రసాద్ ఇజిన డాక్టర్ శీను టీడీపీ లాజర్ బొడ్డపాటి వీర చంద్రం, బిజ్జి రాజు స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు

## పేద విద్యార్థికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 3 :** భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక 41వ డివిజన్‌కు చెందిన ఓ పేద విద్యార్థికి విద్యా ఫీజుల నిమిత్తం తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించి, ఉన్నత విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఫీజుల కోసం ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ "పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదని, చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి విద్యార్థికి తమ వంతు సహాయం అందించేందుకు భవాని చారిటబుల్ ట్రస్ట్ సిద్ధంగా ఉంటుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజానికి సేవ చేయాలని, విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడితో సమానం" అని పేర్కొన్నారు. విద్య, వైద్యం, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చాపల చిన్నరాజు, సలాది ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## 12 వ పి ఆర్ సి ని కమిటిని వెంటనే నియమించాలని

ఎస్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శ సాయి శ్రీనివాస్




**గోకవరం పెన్ పవర్ జులై 03:-** 12 వ పి ఆర్ సి కమిటీ ని వెంటనే నియమించాలని ఆర్థిక బకాయిలను చెల్లించాలనిఎస్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒ ఎఫ్ ఏ ఎఫ్ టి ఓ రాష్ట్ర చైర్మన్ లంకలపల్లి సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం గోకవరం మండలంలోని ఉన్నత పాఠశాలల సందర్శించి ఉపాధ్యాయులనుదేశించి ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, అందులో భాగంగా 12 వ పి ఆర్ సి

కమిటిని వెంటనే నియమించాలని,ఆర్థిక బకాయిలను చెల్లించాలని, టిటు చట్టదవరణ చేయాలని ఈలోపు ఇన్-సర్వీస్ టీచర్స్ కోసం ప్రత్యేక నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధన కోసం ఈ నెల 14 న కలెక్టరేట్ పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి ప్రభుత్వం వెంటనే తగు దిద్దుబాటు చర్చలు చేయాలని ఎస్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒ ఎఫ్ ఏ ఎఫ్ టి ఓ రాష్ట్ర చైర్మన్ లంకలపల్లి సాయి శ్రీనివాస్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ టి యు తూర్పుగోదావరి ప్రధాన కార్యదర్శి జె డి ఐ జె డానియల్ బాబ్, గోకవరం మండల ప్రధాన కార్యదర్శి కె,నాగేంద్రబాబు,అధ్యక్షులు ఓ రమణశర్మ గౌరవ అధ్యక్షులు బి రామకృష్ణతో పాటు మండల ఎస్ టి యు కార్యకర్తలు పాల్గొన్నారు.


# నాకు రక్షణ కల్పించగలను అంటే వస్తా లేకుంటే విచారణ హాజరయ్యేది లేదు.



**డి ఎల్ పి ఓ నాగలక్ష్మి కి ఓ మహిళ విజ్ఞప్తి.**

**గోకవరం పెన్ పవర్ జూలై 03:-** గతంలో మీ సమక్షం లోనే నాపై ఒకసారి దౌర్జన్యం జరిగింది. ఈ రోజు మళ్లీ మీరు పిలిస్తే నేను వచ్చిన నాపై మరొకసారి భౌతిక దాడులు జరిగే అవకాశం ఉన్నందున మీరు నాకు రక్షణ కల్పించగలను అంటేనే మీ దగ్గరకు నేను విచారణకు వస్తాను లేకుంటే నేను రాను అంటూ జిల్లా పంచాయతీ అధికారి నాగలక్ష్మికి కూటమి నాయకురాలు వీర మహిళ కొత్తపల్లి గ్రామానికి చెందిన చల్లా రాజ్యలక్ష్మి అన్నారు. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో ఉన్న మంచి నీటి (కోనేరు)చెరువు ఆక్రమణ పై గ్రామానికి చెందిన మహిళ కూటమి నాయకురాలు అనేక పర్యాయాలు మంచినీటి (కోనేరు) చెరువు ఆక్రమణ గురైపోయిందని రక్షించండి అంటూ అధికారులను వేడుకోవడం జరిగింది. ఈ విషయంపై ఆ గ్రామంలో కొంతమంది సంబంధిత అధికారి పైనే దౌర్జన్యానికి పాల్పడి ఒక మహిళను కూడా చూడకుండా పరుసు పదజాలలతో దూషించారని నేడు మళ్ళీ నన్ను విచారణకు పిలిపించడంతో వారు మళ్ళీ భౌతికంగా దాడులు చేసే అవకాశం ఉన్నందున మీరు నాకు రక్షణ కల్పించ గలను అని హామీ ఇస్తేనే నేను మీ ముందుకు విచారణకు వస్తానని లేకుంటే విచారణకు రానని పీజీఆర్ఎస్ లో ఇచ్చిన ఫిర్యాదు పై వచ్చిన నోటీస్కు ఆమె బదులిచ్చారు.సంబంధిత ఏరియాను మంచి నీటి (కోనేరు)చెరువు పరిశీలించి విచారణ చేసుకుని వెళ్ళవచ్చని చల్లా రాజ్యలక్ష్మి కి డి ఎల్ పి ఓ నాగలక్ష్మి జారీ చేసిన ఇచ్చిన నోటీసు పై లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. పి జి ఆర్ ఎస్ లో ఇచ్చిన ఫిర్యాదు పై విచారణకు వచ్చిన డీఎల్పిఓ నాగలక్ష్మి కి ఎదుటి హాజరు అవ్వడానికి నోటీసులు తెచ్చిన పంచాయితీ కార్యదర్శి ఇచ్చిన నోటీసుపై లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడం మాత్రమే కాకుండా గురువారం కొత్తపల్లి పంచాయతీకి విచారణకు వచ్చిన డీఎల్పిఓ ను కలిసి తన ఆరోపణలు వెల్లడించినట్లు దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నివేదిక ఇస్తానని డిఎల్పిఓ తెలిపినట్లు రాజ్యలక్ష్మి మీడియాకు తెలిపారు.




# ఏపీఎన్నార్టీ ఏపిఎన్ఆర్ టీ కో-ఆర్డినేటర్లుగా పెందుర్తి అభిరామ్ సన్నిహితుల నియామకం.



**నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు**

**కోరుకొండ, పెన్ పవర్, జూలై 3:** ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభ్యున్నతి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ఏ పీ ఎన్ ఆర్ టి కో-ఆర్డినేటర్లుగా రాజానగరం నియోజకవర్గ టీడీపి యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ సన్నిహితులు నియమితులయ్యారు. ఈ నియామకం పట్ల పెందుర్తి అభిరామ్ హర్షం వ్యక్తం చేశారు.

సింగపూర్ రీజినల్ కో-ఆర్డినేటర్లుగా ఎంపికైన మద్దుకూరి సర్వేశ్వరరావు, కన్నెగంటి రేణుకుమార్.

ఆస్ట్రేలియా ఏ పి ఎన్ ఆర్ టికో-ఆర్డినేటర్ సంతోష్ కుమార్ అనుమయలు.

తమ నియామకానికి ప్రత్యేక కృషి చేసిన కేబినెట్ హోదా కలిగిన సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ కి, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కి, ఏపీఎన్నార్టీ సొసైటీ ప్రెసిడెంట్ రవి కుమార్ వేమూరుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ సన్నిహితుల సేవలను గుర్తించి ఈ అరుదైన అవకాశం కల్పించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లినారా లోకేష్ కి పెందుర్తి అభిరామ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ప్రకటించారు

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రజలు భాగస్వామ్యం కావాలి


**తహసీల్దార్ సిహెచ్ శ్రీనివాస్ రావు**



**గంగవరం, పెన్ పవర్ జూలై 3:** ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా మరియు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గంగవరం మండలంలో గత నెల 15వ తేదీ నుంచి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కొనసాగుతున్నట్లు అసిస్టెంట్ ఓటర్ల నమోదు అధికారి, తహసీల్దార్ సిహెచ్ శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వాటిని తిరిగి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. ఓటర్ ఎన్యుమరేషన్ ఫారాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు ఇంకా 11 రోజులు మాత్రమే గడువు ఉన్నందున, ఇప్పటివరకు తమ వివరాలను బీఎల్ఓలకు అందించని ఓటర్లు వెంటనే ఫారాలను పూర్తి చేసి సమర్పించాలని ఆయన కోరారు. అలాగే, 2026 జూలై 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ, యువకులు తమ ఓటు హక్కు నమోదు కోసం వయస్సు నిర్ధారణ పత్రాలు, ఆధార్ కార్డు వంటి అవసరమైన పత్రాలను బూత్ లెవల్ అధికారులకు అందజేసి ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సిహెచ్ శ్రీనివాస్ రావు విజ్ఞప్తి చేశారు.

# మలేరియా నియంత్రణ చర్యలను ముమ్మరం చేయాలి



**జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాలు**

**రంపచోడవరం, పెన్ పవర్ జూలై 3:** జిల్లాలో మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జూలై 2న జిల్లాలో కొత్తగా 15 మలేరియా కేసులు నమోదైన నేపథ్యంలో సంబంధిత మండలాల ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ అధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మలేరియా శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని బాధితుల నివాసాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మలేరియా కేసుకు సంబంధించిన లైన్ లిస్టింగ్ నిర్వహించడంతో పాటు, ప్రభావిత ప్రాంతాల్లో మాస్ స్క్రీనింగ్, ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ (ఐఆర్ఎస్), యాంటీ లార్వల్ ఆపరేషన్స్ వంటి నియంత్రణ చర్యలను ఎలాంటి అలసత్వం లేకుండా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) అన్ని చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ, చేపట్టిన కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మలేరియా నివారణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల నివారణ చర్యలు పాటించడం, జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వికసిత్ భరత్ బి రాంజీ ఉపాధి హామీ పథకం పలు గ్రామాల్లో ప్రారంభించిన పలువురు నాయకులు.





**గోకవరం పెన్ పవర్ జూలై 03:-** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పథకంలో కీలక మార్పులు చేపట్టి వికసిత్ భరత్ బి రాంజీ ఉపాధిహామీ పథకం మార్పు చేసిన నేపథ్యంలో గోకవరం మండలం లోని పలు గ్రామాల్లో పలువురు నాయకులు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో నాయకులు మాట్లాడుతూ 100 రోజుల ఉపాధిని 125 రోజులకు పెంచడంతో పాటు కూలీ రేట్లను కూడా పెంచి నూతన ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించి అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గోకవరం మండల కేంద్రంలోని గుర్రాలవారి చెరువు సమీపంలో గోకవరం మండల బీజేపీ అధ్యక్షుడు ఇనకోటి బాపన్న దొర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గౌడ కార్పొరేషన్ చైర్మన్ మట్ట మంగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ నాయకుల సమక్షంలో కొబ్బరి కాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్తి వెంకటరెడ్డిలు మాట్లాడుతూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా జన్ గ్రామీణ్ మిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని అమల్లోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమం కూటమి నాయకులు కర్రి శివ,టిడిపి సీనియర్ నాయకుడు లాజర్ తదితరులు పాల్గొన్నారు. వీర్లంక పెల్లి వి బి జిరాంజీ పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సుంకర త్రిమూర్తులు కుప్పల వీరబాబు. గోపాలపురం ఇటికాయలపల్లి లో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు బీజేపీ సీనియర్ నాయకులు మట్ట మంగ రాజు, కామరాజుపేటలో బీజేపీ మండల పార్టీ పూర్వ అధ్యక్షులు ముక్క శ్రీను, రంపయర్రంపాలెం లో సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము,సత్యం పెద్దబ్బులు,ఉంగరాల ఆదివిష్ణు,నారా ప్రసాద్, గుమ్మల్ల దొడ్డి గ్రామంలో ఎంపీటీసీ కోట సత్యవతి, మాజీ ఎంపీపీ ఈది అశోక్,ఏగి సాంబశివ టిడిపి తదితరులు పాల్గొన్నారు.

# నరసాపురం సర్పంచ్ రేసులో పెద్దపాటి భీమరాజు..

- గ్రామంలో అందరి వాడిగా మంచి పేరు..
- గ్రామంలో ముమ్మరంగా ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు..



**కోరుకొండ ,పెన్ పవర్ ,జూలై 3:**

కోరుకొండ మండలం నరసాపురం గ్రామ సర్పంచ్ రేసులో పెద్దపాటి భీమరాజు ఉన్నట్లు సన్నిహితులు తెలియజేశారు. ఆయనకు గ్రామంలో అందరివాడిగా మంచి పేరు ఉంది. ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతూ మంచి గుర్తింపు పొందారు. త్వరలో రానున్న స్థానిక ఎన్నికల్లో తాను కూటమి తరుపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తారని ఆయన సన్నిహితులు శ్రేయోభిలాషులు తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామ అభివృద్ధికి భీమరాజు తన వంతు కృషి చేశారు. స్థానిక ఎన్నికల్లో భీమరాజు పోటీలో ఉంటే భారీ మెజారిటీ వచ్చే అవకాశం ఉందని అన్ని పార్టీల్లో చర్చనీయంగా మారింది.

# అస్సాగో ఇండస్ట్రీస్ 2026 సం.10వ తరగతి టాపర్ స్కాలర్‌షిప్ అందజేత.




**గోకవరం పెన్ పవర్ జూలై 03:-**తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) కార్యక్రమంలో భాగంగా మరియు విద్యను ప్రోత్సహించాలనే నిబద్ధతతో, అస్సాగో ఇండ స్ట్రీస్ 2025--2026 విద్యా సంవత్స రానికి గుమ్మల్లదొడ్డి జడ్.పి.పి హై స్కూల్ 10వ తరగతి విద్యార్థుల అసాధారణ విద్యా ప్రతిభను గుర్తించింది. అస్సాగో స్కాలర్షిప్ క్రింద,చుట్టుపక్కల నాలుగు గ్రామాల నుండి పాఠశాలలో 10 వ తరగతి ఫలితాలలో ప్రథమ స్థానం పొందిన పెనుగొండ లావణ్య ప్రభకు రూ 25,000/- ద్వితీయ స్థానం పొందిన పెనుగొండ లాస్యకు రూ 15000/-, తృతీయ స్థానం పొందిన గంగిరాజు కావ్య సూర్య లక్ష్మి కు రూ 10,000/-విద్యార్థుల కృషి నిబద్ధతకు గుర్తింపుగా సర్టిఫికెట్ మరియు నగదు బహుమతులు అందచేశారు. ఈ బహుమతులను అస్సాగో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశిష్ గుర్నానీ అందజేశారు. ఆయన విద్యార్థులతో చర్చించి, వారి ఆశ యాలను తెలుసుకుని, మంచి భవిష్యత్తు కోసం ఉన్నత విద్యను కొనసాగించాలనే ప్రేరణను కలుగజేశారు. విద్యార్థుల తల్లి తండ్రులు మాట్లాడుతూ అస్సగో కంపెనీ వారు ఇచిన ఈ ప్రోతసహముతో పిల్లల మరింత ఉత్సాహంతో పై చదువులు చదువుకోవడానికి ఉత్సుకత చూపిస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమానికి అస్సాగో ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ వి.కే. శుక్లా, లోకేష్ సింఘాల్,(సి ఎఫ్ ఓ )కొణిదెల దేవేంద్రకుమార్,యూనిట్ హెడ్,పుల్లా రెడ్డి,అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (ఏవీపీ ),భవాని శంకర్, సీనియర్ మేనేజర్ (పరిపాలన ఌ భద్రత) ,సన్యాసి రావు, హెచ్ఆర్ మేనేజర్ పాఠశాల చైర్మన్ సురేష్ బాబు హాజరయ్యారు. పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు.

## పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్

* సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశం..





**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.3**
ఇందిరా సాగర్ పోలవరం ప్రాజెక్టు పరిధిలోని వి.ఆర్.పురం,కూనవరం అటవీ క్షేత్రాల్లో కొనసాగుతున్న అటవీ శాఖ పనులను రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధి కారులుశుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రాజమండ్రి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ శ్రీమతి టీ జ్యోతి,చింతూరు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో)డి.రవీంద్రనాథ్ రెడ్డి,సంయుక్తంగా పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించి,సంబం ధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రత్యేకంగా రాష్ట్రఉప ముఖ్యమంత్రి,చేపట్టిన ప్రతిష్ఠాత్మక సీడ్ బాల్స్ కార్యక్రమం అమలుపై వారు ప్రత్యేక దృష్టి సారించారు.సీడ్ బాల్స్ తయారీ విధానం,విత్తనాల ఎంపిక,నాణ్యత ప్రమాణాలు, భద్రపరిచే విధానం, వర్షాకాలంలోవాటిని అటవీ ప్రాంతాల్లో సమర్థవంతంగా వెదజల్లే కార్యాచరణపై అధికారులతో సమీక్ష నిర్వ హించారు.ప్రతి సీడ్ బాల్ మొలకెత్తేలా నాణ్యతకు అత్యంతప్రాధాన్యం ఇవ్వాలని,కార్యక్రమాన్ని శాస్త్రీయ విధానంలోఅమలు చేయాలని సూచించారు.సీడ్ బాల్స్ కార్యక్రమం ద్వారా అడవుల పునరుద్ధరణ,హరితవనం విస్తరణ,జీవవైవిధ్య పరిరక్షణ,పర్యావరణ సమ తుల్యతకు విశేష ప్రయోజనం చేకూరుతుందని అధికారులు పేర్కొన్నారు.వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకొని పెద్ద ఎత్తున సీడ్ బాల్స్ పంపిణీ చేపట్టి,అటవీ సంపద పెంపునకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు.అనంతరం పోలవరం ప్రాజెక్టు పరిధిలోని అటవీ భూముల్లో జరుగుతున్న పనులను పరిశీలించి,పనుల నాణ్యత,పురోగతి, భద్రతా ప్రమాణా లు రికార్డుల నిర్వహణపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని పనులను సమయపాలనతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో వి.ఆర్.పురం అటవీ క్షేత్రాధికారి ఎస్.రామకృష్ణ,కూనవరం అటవీ క్షేత్రాధికారి పీ.వి.వి. సత్యనారాయణమూర్తి,అటవీ శాఖ సిబ్బంది.పాల్గొని, జరుగుతున్న కార్యక్రమాల వివరాలను ఉన్నతాధికారు లకు వివరించారు.అనంతరం అటవీశాఖ,సంబంధిత అధికారులు మట్నక్కలు నాటారు.ఈకార్యక్రమంలో అట వీశాఖ,సంబంధిత అధికారులు అటవీశాఖ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## పరస్పర కొట్లాట కేసుల్లో నిందితులకు జైలు శిక్ష

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జులై 3** :తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాతేరు గ్రామం, మల్లయ్య పేటలో నివసిస్తున్న రెండు కుటుంబాల మధ్య గత వివాదాల నేపథ్యంలో, ది. 7-11-2020 తేదీన కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాల వారికి రక్తగాయలు అయ్యాయి. ఈ ఘటనపై అప్పటి 3వ టౌన్ ఎస్.ఐ. వై.వి. రామ్మోహన్ క్రై,మ్ నంబర్ 814/2020గా సెక్షన్ల 341, 354, 324 ,34 ఐ పి సి , కౌంటర్ కేసుగా సెక్షన్ల .క్రైమ్ నంబర్ 815/2020గా 323, 324, 34 ఐ పి సి కింద కేసులు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు నిర్వహించి న్యాయస్థానంలో చార్జిషీట్లు దాఖలు చేశారు.
తదుపరి జరిగిన విచారణలో ప్రభుత్వ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బి.వి. మోహనరావు, సి.హెచ్.రాజశేఖర్ ,శ్రీమతి ఓ. మహాలక్ష్మి వాదనలు వినిపించారు. 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏ జె ఎఫ్ సి ఎం న్యాయమూర్తి శ్రీమతి సి. జానకి ఇరుపక్షాల వాదోపవాదాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితులపై నేరం రుజువైందని నిర్ధారించి, వారికి శిక్షలు విధిస్తూ తీర్పు వెలువరించారు.ముద్దాయిలకు విధించిన శిక్షలు: 814/2020 కేసులో కొమరి పోతురాజు కు 13 నెలల సాధారణ జైలు శిక్ష , రూ.500/- జరిమానా ,కొమరి వెంకమ్మ -- 13 నెలల సాధారణ జైలు శిక్ష , రూ.500/- జరిమానా , కొమరి కనకరాజు -- 13 నెలల సాధారణ జైలు శిక్ష , రూ.500/- జరిమానా ,
కొమిరి తిరుపతమ్మ -- 13 నెలల సాధారణ జైలు శిక్ష రూ.500/- జరిమానా విధించారు. 815/2020 (కౌంటర్ కేసు)లోవేముల దానమ్మ -- 1 సంవత్సరం సాధారణ జైలు శిక్ష , రూ.500/- జరిమానా,వేముల మరియమ్మ -- 1 సంవత్సరం సాధారణ జైలు శిక్ష , రూ.500/- జరిమానా
విధించారు. ఈ రెండు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన ప్రభుత్వ తరఫు న్యాయవాదులు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, దర్యాప్తు అధికారి అప్పటి ఎస్.ఐ. వై.వి. రామ్మోహన్ కేసుల ట్రయల్ ప్రక్రియను పర్యవేక్షించిన ప్రస్తుత 3 టౌన్ ఇన్‌స్పెక్టర్ వి. అప్పారావు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎన్. వెంకటేశ్వరరావు లను జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, అభినందించారు.

# శివనామస్మరణతో మారుమోగిన నగరం

**వైభవంగా శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి నూతన శివలింగ విగ్రహ శోభాయాత్ర**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 3:**ఓం నమః శివాయ నినాదాలతో నగరం భక్తిచింతనలో మునిగిపోయింది. జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న నూతన శివలింగ విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర ఆధ్యాత్మిక వైభవంతో, వేలాది మంది శివభక్తుల సమక్షంలో వైభవంగా జరిగింది. స్థానిక కంబాల చెరువు దండి మార్చ్ జంక్షన్ నుంచి ప్రారంభమైన మహా శోభాయాత్ర జక్కంపూడి విగ్రహం జంక్షన్, దేవి చౌక్, అల్లూరి సీతారామరాజు విగ్రహం, గణేష్ చౌక్, గాంధీ బొమ్మ జంక్షన్, నందం గన్ని రాజు జంక్షన్ మీదుగా జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం వరకు సాగింది. మార్గమంతా శివనామస్మరణ, హరహర మహాదేవ శంకర నినాదాలు మారుమోగాయి. వేద పండితుల మంత్రోచ్చా రణలు, పూర్ణకుంభ స్వాగతాలు, కోలాట ప్రదర్శనలు, అఘోరాల నృత్యాలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ కళారూపాలతో శోభాయాత్ర వైభవంగా కొనసాగింది. నగర ప్రజలు అడుగడుగునా హారతులు ఇస్తూ స్వామివారికి ఘన స్వాగతం పలికారు. ఈ మహా శోభాయాత్రను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జాంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోని శివలింగ విగ్రహం శిథిలావస్థకు చేరుకోవడంతో దేవస్థాన కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ పునఃప్రతిష్ఠ అనేక దశాబ్దాల పాటు భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచే మహత్తర ఘట్టమన్నారు. .
శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి పునఃప్రతిష్ఠ మహోత్సవాలు 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వైదిక సంప్రదాయాల ప్రకారం జరుగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 4వ తేదీ సా4 గం.లకు జలాధివాసము, 5వ తేదీ ఆదివారం 10.30 గంటలనుండి క్షీరాధివాసము, 6వ తేదీ సోమవారం సాయంత్రం ధాన్యాదివాసములు, 7వ తేదీ మంగళవారం సాయంత్రం పంచశయ్యాధివాసములు, 8వ తేదీ బుధవారం ఉదయం 6.41యంత్ర స్థాపన, మూర్తి (లింగ) స్థాపన సాయంత్రం 4.30 ని.లకు శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం జరుగుతాయి. 9వ తేదీ గురువారం ఉ.6.15 ని.లకు నుండి కుంభాభిషేకము, ఉదయం 11.30 ని.లకు అన్నాభిషేకము జరుగుతాయి. ఈ మహోత్సవాలకు నగర ప్రజలు, శివభక్తులు హాజరై పరమేశ్వరుని కృపాకటాక్షాలు పొందాలని దేవస్థాన కమిటీ, వేద పండితులు, నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు

## జూలై14వ.తేదీలోపు ఓటుహక్కుఫారం సమర్పించాలి.

**-సమాచారాన్ని ఒక ప్రకటనలో తెలిపిన రెవిన్యూ శాఖ**

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.3**
ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితాసవరణ,కార్యక్రమం కొనసాగుతోంది.రాష్ట్రం లోని ప్రతి ఓటరు తమకు అందిన,ఎన్యూమరేషన్ ఫారం (ఏనుమేరేషన్,ఫారం)ను పూర్తి చేసి జూలై14,2026 లోపు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బి.ఎల్.ఓ.)కు తప్పనిసరిగా అందజేయాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం మండలంలో కొందరు మాత్రమే తమ ఫారాలను సమర్పించినట్లు సమాచారం మిగిలిన ఓటర్లు ఆలస్యం చేయకుండా వెంటనే ఫారం పూర్తి చేసి సమర్పించాలని, ఓటుహక్కుఉన్న ఓటర్లలను సంబంధిత అధికారులు కోరారు.జూలై 14లోపు ఫారం సమర్పించని వారి పేర్లు జూలై 21న విడుదలయ్యే ముసాయిదా(డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాలో ఉండకపోవచ్చు. అయితే, డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తర్వాత కూడా క్లెయిమ్స్ మరియు అభ్యం తరాల ప్రక్రియ ద్వారా అర్హులైన వారు తమ పేర్లను చేర్చుకునే అవకాశం.ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు వెంటనే ఎన్యూమరేషన్ ఫారం పూర్తి చేసి బి.ఎల్.ఓ.కు అందజేయాలని ఎన్నికల సంబం ధిత అధికారులు ఒకప్రకటనలో కోరారు.కుటుంబ సభ్యు లు,బంధువులు,పొరుగువారికి కూడా ఈ సమాచారాన్ని తెలియజేసి,అందరూ సమయానికి ఫారాలు సమర్పించా లని,కోరారు.

## ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి





**పేద కళాకారులకు సహాయం**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 03:** విశ్వనట చక్రవర్తి స్వర్గీయ ఎస్వీ రంగారావుకు భారత రత్న ఇవ్వాలని పలు సంఘాలు డిమాండి చేసాయి. స్థానిక తాడేపల్లిగూడెం ఎస్వీఆర్ సర్కిల్ నందు 108వ ఎస్వీ రంగారావు జయంతిని శు క్రవారం ఉదయం ఘనంగా నిర్వహించాడు.
ఎస్వీఆర్ సేవా సంఘం అధ్యక్షులు భోగిరెడ్డి రాము మాట్లాడుతూ తెలుగు సినీ ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పిన తొలి తెలుగు నటుడు ఎస్వీ . రంగారావు అని కొనియాడారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీభాషలలో 250 కి పైగా సినిమాలు చేసి ఇండోనేషియాలో జరిగిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ ఉత్తమ నటుగా అవార్డు పొందారన్నారు. కాపునాడు. అధ్యక్షుడు మాకా శ్రీనివాసరావు మాట్లడుతూ అద్భుత నటనతో ప్రపంచాన్ని మెప్పించిన నటుడు ఎస్వీఆర్ కి తక్షణమే భారత రత్న ప్రకటించాలని డిమాండ్ చేసారు. ఉమ్మడి ప॥ గో జిల్లా కాపు యువత అధ్యక్షులు మారిశెట్టి అజయ్ బాబు మాట్లాడుతూ ఎస్వ్. రంగారావు మరణించి 52 సం॥లు గడిచినప్పటికి ఇప్పటి వరకు సరైన అవార్డు ప్రకటించక పోవటం దురదృష్టకరమన్నారు. కుల మత భాషా ప్రాంతాలకు అతీతంగా విలక్షణ నటుడైన ఎస్వీఆర్ జయంతిని ప్రభుత్వం అధికారకంగా ఎస్వీఆర్ జయంతి వేడుకలు జరపాలని కోరారు. మద్దాల త్రిమూర్తులు , శ్రీకృష్ణ దేవరాయ సేవా సంఘం మాజీ అధ్యక్షులు జంగా శ్రీనివాస రామారాయ్ , ఆకుల శ్రీనివాస్ , వంగవీటి మోహనరంగా అభిమాన సంఘం అద్యక్షులు రాజగోపాల్ , పడాల శ్రీను , కర్రి సత్యనారాయణ, రాగిరెడ్డి ప్రసాద్, బండి. రామస్వామి , కూచిపూడి అనిల్ కుమార్, వర్ణినీడి వరదరాజులు, కుమార్, శీతాళం ప్రభాకర్, నరేంద్ర నాయుడు, యర్రంశెట్టి సత్యనారాయణ, పప్పాప్పుల కుమారస్వామి మద్దాల నాగపండు, కృష్ణారావు, గంధం రాజశేఖర్, ఆకుల నర్శిహుమూర్తి, తదితరులు పాల్గొన్నారు. 10 మంది పేద కళాకారులకు నిత్యవసర వస్తువులు , బియ్యం పంపిణీ చేశారు . మారిశెట్టి అజయ్ బాబు, మద్దాల త్రిమూర్తులు సహకారంతో నిత్యవసర వస్తువులు బియ్యం పంపిణీ చేశారు

## పాలకుల నిర్లక్ష్యం.. రావులపర్రు రైతులకు కష్టం!



**పెన్ పవర్ -- ఉంగుటూరు । జులై 03**
ఉంగుటూరు మండలం రావులపర్రు గ్రామ పరిధిలోని రైతులు సాగునీరు, ముంపునీటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 400 మంది రైతులకు చెందిన 1,400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే బోదెలు (సబ్ ఛానళ్లు), లాకులు, రెగ్యులేటర్లు శిథిలావస్థకు చేరడంతో ప్రతి ఏడాది రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

**లీకేజీలతో సాగునీటి కొరత**
కాగుపాడు లాకుల వద్ద నీటి ప్రవాహాన్ని నియంత్రించే చెక్కలు పూర్తిగా దెబ్బతినడంతో సాగునీరు లీకై వృథా అవుతోంది. దీంతో రావులపర్రు పరిధిలోని అప్పర్ బోదె, కోడు కింద ఉన్న సుమారు 400 ఎకరాలకు సకాలంలో సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**50 ఏళ్ల నాటి రెగ్యులేటర్‌కు మరమ్మతులు కరువు**
అప్‌ల్యాండ్ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద, ముంపునీరు ఉప్పాకపాడు అండర్‌టన్నెల్ ద్వారా తోకలపల్లి ప్రధాన ముంపు కాలువలోకి చేరుతుంది. ఈ కాలువపై రావులపర్రు వద్ద దాదాపు 50 ఏళ్ల క్రితం రైతులే స్వచ్ఛందంగా నిర్మించిన రెగ్యులేటర్ ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. తలుపులు, చెక్కలు విరిగిపోవడంతో రైతులే తమ సొంత నిధులతో అప్పుడప్పుడు మరమ్మతులు చేయించుకుంటున్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం లేదా సంబంధిత నీటిపారుదల శాఖ శాశ్వత చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదకరంగా మారిన ఇనుప గెడ్డర్లు**
రెగ్యులేటర్ వద్ద ఇనుప గెడ్డర్లు పట్టు తప్పి బయటకు వచ్చి వంతెనపై ప్రయాణించే వారికి ప్రమాదకరంగా మారాయి. బండరాళ్లతో తాత్కాలికంగా నిలబెట్టిన ఈ నిర్మాణం ఎప్పుడు కూలిపోతుందోననే భయంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ ఇరిగేషన్, డ్రైన్స్ శాఖ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**వెంటనే మరమ్మతులు చేపట్టాలి**
లాకులు, రెగ్యులేటర్లు దెబ్బతినడంతో 1,400 ఎకరాల్లో వరి సాగు చేస్తున్న రైతులు ప్రతి ఏడాది పెట్టుబడులు కోల్పోతున్నారు. వర్షాకాలంలో ముంపునీరు వెళ్లక పంటలు మునిగిపోతుండగా, ఎండాకాలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే స్పందించి కాగుపాడు లాకులు, రావులపర్రు రెగ్యులేటర్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**రైతు వేదన**
"రైతు కష్టాలు పట్టించుకునే వారే లేరు" అని రావులపర్రుకు చెందిన రైతు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు యడ్లపల్లి చంటి ఆవేదన వ్యక్తం చేశారు.
"కాగుపాడు లాకులు, రావులపర్రు రెగ్యులేటర్ నిర్వహణ లోపంతో వందలాది ఎకరాల్లో సాగు, ముంపునీటి సమస్యలు తీవ్రమయ్యాయి. పదేళ్ల క్రితం రూ.80 వేల సొంత నిధులతో మరమ్మతులు చేయించాం. ఎన్నిసార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా స్పందన లేదు. పైగా వరి సాగు మానేసి చేపల చెరువులు తవ్వుకోవాలని సలహాలు మాత్రమే ఇస్తున్నారు" అని ఆయన విమర్శించారు.

## మెకానిక్ లకు అండగా






**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. జులై 03:**
నిత్యజీవితంలో మోటార్ సైకిల్ మెకానిక్ ల సేవలు ఎంతో కీలకమని, వారికి అండ దండలు అందిస్తామని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ అన్నారు. మెకానిక్స్ డే సందర్భంగా శు క్రవారం తాడేపల్లిగూడెం మోటార్ సైకిల్ మెకానిక్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బొలిశెట్టి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెకానిక్స్‌కు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాజేష్ మాట్లాడుతూ, ప్రజల రోజువారీ జీవితంలో మెకానిక్స్ పాత్ర ఎంతో కీలకమని అన్నారు. డాక్టర్లు మన ఆరోగ్యాన్ని కాపాడినట్లే, మెకానిక్స్ మన వాహనాలకు రిపేర్లు చేసి ప్రయాణాన్ని సాఫీగా కొనసాగించే బాధ్యతను నిర్వర్తిస్తారని అన్నారు.మెకానిక్స్ లేకపోతే మన రోజువారీ పనులు సక్రమంగా సాగడం కష్టమని అన్నారు. మెకానిక్స్ డే నిర్వహించడం సేవా రంగాలకు సమాజం ఇస్తున్న గౌరవానికి నిదర్శనమని అన్నారు. మెకానిక్స్ ఎదుర్కొంటున్న సమస్యలను శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని తెలియజేశారు. పరస్పర సహకారంతో ముందుకు వెళదామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లకు మెకానిక్ లు ఆందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెకానిక్ అసోసియేషన్ సభ్యులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కమలం వైపు నేతల చూపు

**నెల్లూరు జూలై 2, పెన్ పవర్:**
ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల్లోని కీలక నాయకులు కొందరు బీజేపీ వైపు చూస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా , ఎంపీలుగా ఉన్న ఒకరిద్దరు నాయకుల పేర్లు కూడా తరచుగా వినిపిస్తున్నాయి. 'ఏమో.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో.. తప్పేముంది. ఈ పార్టీ కాకపోతే.. మరొకటి. నాకు సత్తా ఉంది. ఆ పార్టీకి చేర్చుకునేందుకు అవకాశం ఉంది.' అని క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఓ కీలక నాయకుడు ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించారు. ఇక, ఎంపీల విషయంలోనూ ఇదే తరహా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి కోస్తా జిల్లాల్లోని ఓ ఎంపీ గత ఎన్నికలకు ముందు చివరి నిమిషంలో టీడీపీ బీ ఫాం దక్కించుకున్నారు. కానీ, ఆయన పార్టీపరంగా కంటే.. జాతీయస్థాయి నేతలతోనే ఎక్కువగా టచ్‌లో ఉంటున్నారు. దీనికి కారణం.. అవసరమైతే.. వచ్చే ఎన్నికల్లో మార్పు కోసమేనని ఆయన చెబుతున్నారు.ద

ఇది వినేందుకు చిత్రంగా ఉన్నా.. ఎవరికి వారు అప్పుడే కర్చీఫ్‌లు రెడీ చేసుకుంటున్నారు.ఇక, వైసీపీలోనూ కొందరు ఎమ్మెల్యేలు ఇదే బాటలో ఉన్నారన్న చర్చ కూడా ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ సీనియర్ నాయకుడు బీజేపీతో టచ్‌లోకి వెళ్లారు. అయితే.. ఆయన కీలక పదవిని ఆశించారని.. ఆ పదవి ఇచ్చే విషయంలో బీజేపీ వెనక్కి తగ్గడంతో ఆయన మౌనంగా ఉన్నారని వైసీపీలోనే చర్చ సాగుతోంది. ఇక, ఓ ఎంపీ అయితే.. నేరుగా బీజేపీ నేతలతోనే కలివిడిగా ఉంటున్నారు. ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడిపేస్తున్నారు. బీజేపీ మంత్రుల కార్యాలయాల్లోనూ ఆయన కనిపిస్తున్నారు. ఎంపీగా పనులు చేయించుకునేందుకు వచ్చానని సదరు పార్లమెంటు సభ్యుడు సెలవిస్తున్నారు. అయితే.. ఇదంతా ఎందుకంటే.. అధికార

పార్టీకి చెందిన నాయకుల్లో టికెట్ల బెంగ కనిపిస్తోంది. వారిపై చేయిస్తున్న సర్వేల్లో మార్కులు తగ్గడం... వచ్చే ఎన్నికల్లో టికెట్లు దక్కుతాయోలేదో నన్న బెంగ వెంటాడుతుండడంతో సదరు నేతలు ముందుగానే వచ్చే ఎన్నికలకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక, వైసీపీ నాయకుల్లో వచ్చే ఎన్నికలపై పెద్దగా ఆశలు లేకుండా పోతున్నాయన్న వాదన ఉంది. ఏమో మళ్లీ విపక్షంలో కూర్చునే పరిస్థితి వస్తుందేమోనని వారు బెంగ పెట్టుకున్నారని అంటున్నారు. అందుకే కేసుల బెడద నుంచి తప్పించుకునేందుకు బీజేపీతో ముందుగానే టచ్‌లోకి వెళ్లిపోయారట.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## టూ టైర్ సిటీస్ లో విల్లా కల్చర్

**కాకినాడ, జూలై 3, పెన్ పవర్:**
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్థిరాస్తి మార్కెట్ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా స్థిరమైన వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. ముఖ్యంగా రాజమండ్రి రూరల్ పరిసర ప్రాంతాలతో పాటు కాకినాడ అచ్యుతాపురం ఎకనామిక్ జోన్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పారిశ్రామిక విస్తరణ, మౌలిక వసతుల కల్పన వేగవంతం కావడంతో ఈ కారిడార్‌లోని ల్యాండ్ మార్కెట్ వైపు మదుపరులు భారీగా ఆకర్షితులవుతున్నట్లు ఈ వారం పత్రికల బిజినెస్ పేజీలు ప్రత్యేక విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించాయి.ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఇంతలా పుంజుకోవడానికి ప్రధాన బలం గోదావరి జిల్లాల్లోని సంపన్న వర్గాల నుంచి వస్తున్న పెట్టుబడులేనని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో అత్యంత లాభదాయకంగా సాగుతున్న ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు, స్థానిక పారిశ్రామికవేత్తలు తమకు వస్తున్న లాభాలను సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా భావించి భూములపై పెడుతున్నారు. షేర్ మార్కెట్, ఇతర వ్యాపారాల కంటే స్థిరాస్తి రంగానికే దీర్ఘకాలంలో తిరుగులేని లాభాలు వస్తుండటంతో, వీరంతా గ్రూపులుగా ఏర్పడి మరీ కనెక్టింగ్ రోడ్ల వెంబడి వందల ఎకరాలను కొనుగోలు చేస్తున్నారు.రాజమండ్రి రూరల్ పరిధిలోని శాటిలైట్ సిటీ పరిసరాలు, కడియం, జేగురుపాడు వైపు వెళ్లే మార్గాలతో పాటు.. కాకినాడ నుంచి అచ్యుతాపురం సెజ్ కనెక్టివిటీ ఉన్న రహదారుల ఇరువైపులా కొత్త కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. డీటీసీపీ అనుమతులతో మౌలిక వసతులు కల్పిస్తూ రియల్టర్లు వేస్తున్న లేఅవుట్లకు హాట్ కేకుల్లా డిమాండ్ ఏర్పడింది. మధ్యతరగతి వర్గాలు సొంత ఇంటి కల కోసం ఓపెన్ ప్లాట్లను ఎంచుకుంటుంటే, హైవే ఫేసింగ్ ఉన్న బిట్లను కమర్షియల్ అవసరాల కోసం కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున పోటీ నడుస్తోంది.స్థానిక పారిశ్రామిక వేత్తల అండదండలు, నిరంతర నగదు సరఫరా పుష్కలంగా ఉండటంతో ఇక్కడి స్థిరాస్తి వ్యాపారానికి ఎటువంటి ఢోకా లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అటు ఐటీ, ఇటు పారిశ్రామికంగా కాకినాడ-రాజమండ్రి జంట నగరాల మధ్య రీజినల్ గ్రోత్ కారిడార్ వేగంగా విస్తరిస్తుండటంతో రాబోయే రోజుల్లో ఇక్కడ చదరపు గజం ధరలు మరింతగా పెరగడం ఖాయమని, ఫలితంగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ఆదాయం కూడా భారీగా పెరుగుతోందన్న అంచనాలున్నాయి.

## లోకల్ బాడీ ఎలక్షన్స్ గురి...

**విజయవాడ, జూలై 2, పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ పార్టీ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా పార్టీపరంగా కొన్ని దిశానిర్దేశాలు చేస్తున్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి కూడా వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభవం తిరిగి తీసుకురావాలన్నదే జగన్ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న. ఎందుకంటే.. ఎవరు అధికారంలో ఉంటే వారే స్థానికంగా విజయం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అసలు పోటీ నుంచే తప్పుకొంది. అయినా.. కొందరు టీడీపీ నాయకులు పోటీ చేశారు. ఇక, ఇప్పుడు వైసీపీ స్థానికంలో అయినా.. గెలుపు గుర్రం ఎక్కి.. విజయం దక్కించుకుని గత ఎన్నికల్లో జరిగిన పరాభవం నుంచి బయట పడేందుకు ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వంపై ఉన్న సానుకూలత వైసీపీకి కలసి వచ్చేలా లేదు. పింఛన్ల పంపిణీ నుంచి గ్రామీణ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి వంటివి వైసీపీకి వ్యతిరేకతను కొనసాగిస్తున్నాయి. నాడు వైసీపీ పనులు చేసి ఉంటే ఇప్పుడు చెప్పుకొనేందుకు అవకాశం ఉండేదని కూటమి నాయకులు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఈ ఎఫెక్ట్ ఎక్కువగా పడే ప్రభావం ఉందని అంటున్నారు. దీనికితోడు క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య ఐక్యత కూడా కనిపించడం లేదు. జగన్ రావాలి.. పార్టీని పట్టించుకోవాలని అనే నాయకుల సంఖ్య ఎక్కువగా ఉందే తప్ప.. వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుని ముందుకు సాగాలన్న లక్ష్యంతో నాయకులు ముందుకు కదలడం లేదు.మరోవైపు.. కూటమికి ఉన్న బలమైన వాయిస్ కూడా వైసీపీకి లేదనే చెప్పాలి. టీడీపీ, జనసేన అధినేతలు..తమ బలమైన గళంతో ప్రజల మధ్యకు వెళ్తుంటే.. వైసీపీ అధినేత మీడియా సమావేశాలకు.. చూసి చదువుతున్న స్క్రిప్టు లకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఇవన్నీ.. వైసీపీని ఇరకాటంలో నెడుతున్నాయి. ట్రోల్స్‌కు గురయ్యేలా కూడా చేస్తున్నాయి. ఈ ప్రభావం కూడా స్థానిక ఎన్నికలపై పడే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేకతను నమ్ముకున్న వైసీపీకి దానిని చేరువ కావడం సాధ్యం కాదన్న అంచనాలు కూడా వస్తున్నాయి

## చడీ చప్పుడు లేకుండా..
## పవన్ కల్యాణ్ తిరుమల టూర్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఎక్కడికి వెళ్లినా అధికారికంగా ముందస్తు ప్రకటన విడుదల చేస్తారు. ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా మీడియాకు ఇస్తారు. ప్రొటోకాల్‌లో భాగంగా డిప్యూటీ సీఎం హోదాలో ఆయనకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందిస్తారు. గత నెలలో తెలంగాణలో పర్యటించినప్పుడు.. అదేవిధంగా ఢిల్లీలో పార్టీ సమావేశం ఏర్పాటు చేసుకున్నప్పుడుకూడా మీడియాకు, ప్రజలకు కూడా సమాచారం ఇచ్చారు. అయితే, తాజాగా పవన్ కల్యాణ్ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే తిరుమలలో ప్రత్యక్ష మ య్యారు. తిరుమల అధికారులకు కూడా ఆయన ఆలయానికి వచ్చే గంట ముందు మాత్రమే సమాచారం అందినట్టు చెబుతున్నారు. దీంతో హడావుడిగానే ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం అనూహ్యంగా తిరుమల శ్రీవారి ఆలయానికి చేరుకున్న పవన్ కల్యాణ్ ధ్వజస్తంభానికి మొక్కుకుని... నేరుగా శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఈ పర్యటనలో కేవలం ఆయన మాత్రమే ఉన్నారు. ఇదే రోజు ఏపీ మంత్రి, టీడీపీ యువ నేత నారా లోకేష్ కూడా శ్రీవారిని దర్శించుకోవడం గమనార్హం. అయి తే.. లోకేష్ పర్యటన వివరాలను.. ముందుగానే వెల్లడించినా.. పవన్ కల్యాణ్ టూర్ విషయాన్ని మాత్రం అధికారులు చెప్పకపోవడం గమనార్హం. ఇటీవల తన ఆరోగ్యం బాగోకపోవడంతో మొక్కులు చెల్లించుకు నేందుకు తిరుమలకు వెళ్లి ఉంటారని జనసేన నాయకులు చెబుతున్నారు. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటనా లేదు.

**దాదాపు ఏడాది తర్వాత..**
దాదాపు ఏడాది తర్వాత పవన్ కల్యాణ్ తిరుమలలో పర్యటించడం గమనార్హం. 2025 ప్రారంభంలో తిరుమల లడ్డూ వివాదం వచ్చినప్పుడు ఆయన సనాతన ధర్మ దీక్ష చేపట్టారు. ఆ సమయంలో దీక్షలోనే తిరుమలకు వెళ్లిన ఆయన.. అక్కడే విరమణ చేశారు. సనాతన ధర్మ దీక్ష పేరుతో తిరుపతిలో సభ కూడా నిర్వహించారు. ఆ తర్వాత.. మళ్లీ ఇప్పుడే తిరుమలలో పనవ్ కల్యాణ్ పర్యటించడం గమనార్హం.

# హోమ్ మంత్రిగారి మౌనమెందుకో...

**విజయవాడ, జూలై 3, పెన్ పవర్:**
ఏపీ హోం మినిస్టర్ వంగలపూడి అనిత యమా యాక్టివ్‌గా ఉంటారు. పొలిటికల్ ప్రత్యర్థులపై ఓ రేంజ్‌లో విరుచుకుపడుతుంటారు. ప్రతిపక్ష నేత జగన్‌ను ఉద్దేశించి పులివెందుల ఎమ్మెల్యే అని సెటైరికల్‌గా మాట్లాడ్డం ఆమెతోనే మొదలైందని చెప్పుకుంటాయి రాజకీయవర్గాలు. అంతవరకు సరే.. రాజకీయ వ్యవహారాల్లో ఎవరి లెక్కలు వారికి ఉంటాయి. కానీ, మంత్రి హోదాలో ఉండి సంబంధింత శాఖ వ్యవహారాల గురించి పట్టించుకోకుండా అనిత కేవలం పొలిటికల్ స్టేట్‌మెంట్స్‌కే పరిమితం అవుతున్నారా అన్నది చాలా మందికి వస్తున్న లేటెస్ట్ డౌట్.ఎందుకంటే.. రాష్ట్రాన్ని కుదిపేసిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసుపై హోం మినిస్టర్ సక్రమంగా స్పందించలేదన్నది రాజకీయవర్గాల విస్తృతాభిప్రాయం. ఆ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు ఒకే ఒక్కసారి స్పందించారామె. అదీ కూడా కేవలం ఐదు సెకన్ల రియాక్షన్. సాధారణంగా పొలిటికల్ స్టేట్‌మెంట్స్ విషయంలో అనర్గళంగా మాట్లాడే అనిత అత్యంత కీలకమైన కేసు విషయంలో కేవలం ఐదు సెకన్లకే ఎందుకు పరిమితం అయ్యారన్నది బిగ్ క్వశ్చన్. రాష్ట్ర హోం మంత్రిగా అంత సీరియస్ సమస్య మీద సరిగా స్పందించకపోవడంపై వివిధ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయట.

కస్టోడియల్ డెత్ కేసు విషయంలో ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ మంత్రే మాట్లాడ్డం లేదా? లేక స్పందించవద్దని ఆమెకు ఆదేశాలున్నాయా అన్న చర్చలు సైతం పెరుగుతున్నాయి. ఇదే విషయాన్ని విపక్షాలు సైతం నిలదీస్తున్నాయి. అత్యంత ముఖ్యమైన కేసు విషంలో హోం మంత్రి స్పందన అత్యంత పేలవంగా ఉండటం ఏంటి? హోం మంత్రి నోరు కట్టేస్తోంది ఎవరో తేల్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు ప్రతిపక్ష నాయకులు. ఈ కేసుకు సంబంధించి హోం మంత్రి రియాక్షన్‌పై రాజకీయవర్గాలతో పాటు సామాన్యుల్లో సైతం రకరకాల డౌట్స్ పెరుగుతున్నాయట.రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి ఒకరు హోం మినిస్టర్ మేకప్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే.. అంతా ఖండించారు. అలాంటిది ఒక ప్రాణం విషయంలో ఆ స్థాయి స్పందన లేకపోవడం ఏంటన్న మాటలు వినిపిస్తున్నాయి. పై నుంచి వచ్చిన ఆదేశాలతోనే అనిత అలా వ్యవహరిస్తున్నారా అన్న సందేహాలు చాలామందిలో వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో

సంబంధిత మంత్రికంటే ఎక్కువగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించారు. అయినాసరే ఆమె నుంచి నో రియాక్షన్ అంటే... దీన్నెలా అర్థం చేసుకోవాలంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెడుతున్నారు పరిశీలకులు. ఇదే సమయంలో చాలామంది ఇప్పుడు డిప్యూటీ సీఎం వ్యాఖ్యలను కోట్ చేస్తున్నారట. నేనే హోమ్ మంత్రి అయిఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేదని పవన్ వ్యాఖ్యా నించడం..అనిత విషయంలో సరిగ్గా సరిపోతుందా అనే చర్చలు సైతం నడుస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ ఏ ఉద్దేశ్యంతో అలాంటి వ్యాఖ్యలు చేశారోగానీ.. వాతావరణం మాత్రం అలాగే కనిపి స్తోందని అభిప్రాయపడుతున్నారు కొందరు.కారణం ఏదైనాసరే.. రాష్ట్రంలో ఇంత పెద్ద ఘటన జరిగితే హోమ్ మంత్రి నోరు మెదపక పోవడం మాత్రం తీవ్ర చర్చనీయాంశం అయింది

# మావిగన్ అయితే... విశాఖ సంగతేంటీ

**విశాఖపట్టణం జూలై 3, పెన్ పవర్:**
విశాఖ మన రాజధాని అని వైసీపీ అధినేత జగన్ గతంలో చెప్పారు. తాను 2024లో మరోసారి గెలిస్తే విశాఖ నుంచే ప్రమాణం చేస్తాను అని కూడా చెప్పారు. విశాఖలో అన్నీ ఉన్నాయి అది సహజసిద్ధమైన రాజధాని అని వైసీపీ నేతలు పలు మార్లు చెప్పుకొచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో చేదు ఫలితాలు దక్కిన తరువాత కానీ వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని అంటున్నారు. అందుకే కొన్నాళ్ళ పాటు సైలెంట్ గా ఉండి ఇపుడు దాదాపుగా టీడీపీ రూట్లోనే వెళ్తున్నారు అని అంటున్నారు. టీడీపీ కూడా అమరావతి రాజధాని అన్నది. విజయవాడ గుంటూరులకు దూరంగా కొత్త నగరం నిర్మించే పనిలో టీడీపీ ఉంది. అయితే వైసీపీ మాత్రం రెడీ మేడ్ గా మావిగన్ అని అంటోంది. అంటే విశాఖకు బదులుగా మావిగన్ తెచ్చినా రెడీ మేడ్ సిటీ విషయంలో మాత్రం వైసీపీ పక్కకు జరగలేదు అన్నది స్పష్టం అవుతోంది. ఇక విశాఖ రాజధాని అన్నారు. బీచ్ రోడ్డులో రుషికొండ మీద టూరిజం రిసార్ట్స్ ని తొలగించి అక్కడ సీఎం క్యాంప్ ఆఫీసు అని నివాసం అని దాని పేరుతో భారీ భవనాలు కట్టారు. నాలుగు వందల కోట్ల రూపాయలు దాని కోసం ఖర్చు చేశారు. విశాఖలో సముద్రం ఉంది, రైల్ రోడ్డు ఎయిర్ కనెక్టివిటీ ఉందని కూడా చెప్పారు. ఉత్తరాంధ్రా వెనకబాటుతనం అంతా పోయేలా విశాఖ క్యాపిటల్ ద్వారా అభివృద్ధి సాగుతుందని కూడా ప్రకటించారు.

కానీ ఇపుడు విశాఖను వెనక్కి తీసుకున్నారు. ఆశ పెట్టి తగ్గిపోయారు అని అంటున్నారు. మరి దీని మీద ఉత్తరాంధ్రా వైసీపీ నేతల రియాక్షన్ ఎలా ఉంటుంది అన్నది కూడా చర్చకు వస్తోంది. ఇక విశాఖ రాజధాని అన్నపుడు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి వారు గట్టిగా సమర్ధించారు. మా ప్రాంతం బాగు పడవద్దా అని కూడా ప్రశ్నించారు. మాకు రాజధాని వస్తుంటే టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు అని కూడా విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అలాగే బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా విశాఖ రాజధానికి జై కొట్టారు. మరి ఇపుడు వైసీపీ అయితే మావిగన్ అని తన రూట్ మార్చి ప్లేట్ తిప్పేసింది. దాంతో ఈ మాజీ మంత్రులు ఇంకా వైసీపీలోని కీలక నేతలు సీనియర్ నేతలు ఏమంటారు అని ప్రశ్నలు వస్తున్నాయి. అలాగే విశాఖ రాజధాని అని వైసీపీ నేతలు ఎంత గట్టిగా చెప్పినా మరెంత ఆర్భాటం చేసినా జనాల మద్దతు అయితే ఏ కోశానా లేదని తేలిపోయింది. విశాఖ రాజధాని అన్న తరువాతనే 2023లో ఉత్తరాంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు

జరిగితే ప్రజలు యువత ఉద్యోగులు విద్యావంతులు అంతా కలసి టీడీపీకే ఓటేశారు. ఆ తరువాత 2024లో విశాఖ జిల్లా మొత్తం ఒక్క సీటూ వైసీపీకి లేకుండా చేశారు. ఇంతే కాదు గత అయిదేళ్లలో వైసీపీ విశాఖ రాజధాని అని ఎంతగా చెప్పినా జనాల నుంచి పాజిటివ్ రియాక్షన్ అయితే పెద్దగా రాలేదని గుర్తు చేస్తున్నారు. అందుకే వైసీపీ కూడా తన నిర్ణయం మార్చేసుకుంది అని అంటున్నారు. అయితే చెప్పుకోవడానికి ఈ రీజన్ బాగుంది కానె విశాఖ సహా ఉత్తరాంధ్రా అభివృద్ధి మీద వైసీపీ చిత్తశుద్ధి ఇంతేనా అన్న చర్చ కూడా మరో వైపు సాగుతోంది. మరి వైసీపీ ఏ విధంగా దీని మీద జనాలకు చెప్పుకుంటుందో చూడాల్సి ఉంది.

# వై నాట్ 174 టీడీపీ నినాదమా...




**శ్రీకాకుళం, జూలై 2, పెన్ పవర్:**
తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన చింతకాయల విజయ్ తాజాగా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. నర్సీపట్నంలో తనకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ని దమ్మున్న నాయకుడిగా కొనియాడారు. లోకేష్ తనది కాని నియోజకవర్గంలో టీడీపీకి అంతగా విజయావకాశాలు లేని సీట్లో గెలిచి చూపించారు అని విజయ్ గుర్తు చేశారు. మంగళగిరిలో ఒకసారి ఓటమి పాలు అయినా పట్టు వీడకుండా లోకేష్ మళ్లీ అదే స్థానం నుంచి గెలిచారు అంటే అదే లోకేష్ సత్తా అని అన్నారు. కానీ విపక్ష నేత జగన్ మాత్రం పులివెందుల దాటి బయటకు వచ్చి ఎక్కడైనా పోటీ చేసే సత్తా ఉందా అని విజయ్ ప్రశ్నించారు. జగన్ పులివెందులకు మాత్రమే పరిమితం అని విజయ్ ఎద్దేవా చేసారు. తెలుగుదేశం పార్టీకి సమర్థుడు అయిన నాయకుడు నారా లోకేష్ అని అన్నారు. ఆయన చేతుల్లోనే టీడీపీకి మంచి భవిష్యత్తు ఉందని విజయ్ అన్నారు. లోకేష్ నాయకత్వాన్ని ప్రతీ కార్యకర్త పూర్తి స్థాయిలో బలపరుస్తున్నారని కూడా విజయ్ చెప్పారు. లోకేష్ తన కుటుంబంగానే పార్టీలోని అందరినీ చూసుకుంటారు అని ఆయన తమ కుటుంబం మీద చూపించే అభిమానం ఆప్యాయతలు ఎంతో గొప్పవని అని విజయ్ చెప్పారు. ఇందుకు గానూ తాను లోకేష్ కి రుణపడి ఉంటాను అని విజయ్ చెప్పారు.టీడీపీ అధినేత చంద్రబాబు గురించి విజయ్ చెబుతూ ఆయనను నమ్ముకుంటే చాలు అందరికీ న్యాయం తప్పకుండా జరుగుతుందని అన్నారు. తాను మూడు సార్లు అనకాపల్లి ఎంపీ సీటు కోసం ప్రయత్నం చేశాను అని విజయ్ చెప్పారు. అయితే ఆ మూడు సార్లు నిరాశ ఎదురైంది అని అన్నారు. అయితే అదే సమయంలో చంద్రబాబు తనను పిలిచి నన్ను నమ్ము విజయ్ నీకు మంచి స్థానం ఇస్తాను అని చెప్పేవారు అని విజయ్ గుర్తు చేసుకున్నారు. ఇపుడు బాబు ఏకంగా తనకు రాజ్యసభ సీటు ఇచ్చి తన మాటను నిలబెట్టుకున్నారు అని బాబుకు సదా కృతజ్ఞతలు అని విజయ్ చెప్పారు. తమ కుటుంబానికి మొదటి నుంచి చంద్రబాబు ఆదరణ మద్దతు ఉందని విజయ్ చెప్పారు. తాను తెలుగుదేశం పార్టీకి జెండా కూలీగా పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. పార్టీ ఆదేశాలు తుచ తప్పకుండా పాటిస్తాను అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ అన్యాయం జరిగినా తాను ముందు ఉంటాను అని విజయ్ హామీ ఇచ్చారు. తాను పార్టీ కోసం ఎంతైనా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. నర్సీపట్నంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీగా తన వంతుగా కష్టపడి పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో సృష్టి క్షేత్రం పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానిస్తామని విజయ్ తెలిపారు. సృష్టి క్షేత్రంలో ప్రపంచంలోనే ఎత్తైన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను నెలకొల్పుతామని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో అభివృద్ధి పనులకు ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని విజయ్ స్పష్టం చేశారు. మొత్తానికి చూస్తే అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్ సింహ గర్జన చేశారు. రానున్న రోజుల్లో అయ్యన్న ప్లేస్ లో పూర్తి స్థాయి రాజకీయానికి విజయ్ సిద్ధపడుతున్నారు అనడానికి తాజా సభ ఒక నిదర్శనంగా చెబుతున్నారు.



## కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్

# ప్రతి రోజు ఒక కొత్త బ్రాండ్: కోట్లు కొల్లగొడుతున్న జాన్వీ!



బాలీవుడ్ స్టార్ కిడ్, టాలీవుడ్ క్రేజీ బ్యూటీ జాన్వీ కపూర్ వెండితెరపైనే కాదు.. డిజిటల్ ప్రపంచంలోనూ తిరుగులేని సామ్రాజ్యాన్ని సృష్టిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 2.67 కోట్లకు పైగా ఉన్న ఫాలోయింగ్, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఉన్న క్రేజ్‌ను ఈ యంగ్ బ్యూటీ క్యాష్ చేసుకుంటున్న తీరు చూస్తుంటే ట్రేడ్ వర్గాలు సైతం ముక్కున వేలేసుకుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు ఈ భామతో ప్రమోషన్స్ చేయించేందుకు క్యూ కడుతుండటంతో జాన్వీ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల డిజిటల్ షోరూమ్‌లుగా మారిపోయాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో జాన్వీ కపూర్ పోస్ట్ చేసే ఒక్కో ప్రమోషనల్ కంటెంట్ వెనుక భారీ వ్యాపార సామ్రాజ్యం దాగి ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం..ఈ భామ ఒకే ఒక్క యాడ్ పోస్ట్ లేదా రీల్ కోసం సుమారు 7 లక్షల నుండి 10 లక్షల వరకు వసూలు చేస్తోంది. అలాగే ఎక్స్ ఖాతాలో చేసే పోస్టులకు లక్షల్లో డిమాండ్ చేస్తోంది. కేవలం విడివిడి పోస్టులే కాకుండా ఒప్పో, లెన్స్‌కార్ట్, తుమి, హావెల్స్ వంటి అగ్రశ్రేణి కంపెనీలకు గంపగుత్తగా (బల్క్ ప్యాకేజీ) బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. ఏడాదికి 1 కోటి నుండి 2.5 కోట్ల వరకు ఒప్పందాలు కుదుర్చుకుంటోందని టాక్ వినిపిస్తోంది.

నెలవారీ లెక్కలు చూస్తే.. జాన్వీ కపూర్ డిజిటల్ ఆదాయం ఊహకందని స్థాయిలో ఉంది. ఒక నెలలో కనీసం డజనుకు పైగా విభిన్న బ్రాండ్స్ (లైఫ్ స్టైల్, గ్యాడ్జెట్స్, బ్యూటీ ప్రొడక్ట్స్) ప్రకటనలను నిరంతరాయంగా పోస్ట్ చేస్తూనే ఉంటుంది. ఈ రకంగా చూసినా.. సోషల్ మీడియా వేదికల ద్వారానే ఈ బ్యూటీ నెలవారీ ఆదాయం 1.5 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ప్రస్తుతం డిజిటల్ మార్కెట్లో ఇంతటి క్రేజ్, కమర్షియల్ వాల్యూ ఉన్న మరో స్టార్ బ్యూటీ బాలీవుడ్‌లో లేరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

కేవలం డిజిటల్ ప్రమోషన్స్ మాత్రమే కాకుండా... సినిమాల పరంగానూ జాన్వీ కపూర్ పారితోషికం ఆకాశాన్ని తాకుతోంది. హిందీ చిత్రసీమలో ఈ భామ నటిస్తున్న ఒక్కో సినిమాకు బడ్జెట్ - ప్రొడక్షన్ హౌస్‌ను బట్టి సుమారు 5 కోట్ల నుండి 6 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో పాటు గ్లామర్ పాత్రలకు సమన్యాయం చేస్తుండటంతో బాలీవుడ్ మేకర్స్ ఈ యంగ్ బ్యూటీ అడిగినంత ఇచ్చేందుకు వెనుకాడటం లేదు.

మరోవైపు.. సౌత్ ఇండియాలో (టాలీవుడ్‌లో) జాన్వీ కపూర్ ఎంట్రీ ఒక సంచలనంగా మారింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటించిన -దేవర- చిత్రానికి గానూ దాదాపు 2 కోట్ల నుండి 3 కోట్ల వరకు పారితోషికం అందుకున్నట్లు టాలీవుడ్ టాక్. ఇక గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ క్రేజీ ప్రాజెక్ట్ -పెద్ది- కోసం దాదాపు 4 కోట్ల పారితోషికాన్ని వసూలు చేసిందని ప్రచారం ఉన్నా.. దానిపై అధికారికంగా క్లారిటీ లేదు. ఇలా సినిమాలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ జాన్వీ కపూర్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది.



## శివంగి వర్మ సొగసైన లుక్స్

# టీమిండియాతో వన్డే సిరీస్‌కు ఇంగ్లండ్ జట్టులో కొత్త ముఖం

**భారత్‌తో వన్డే సిరీస్‌కు 16 మందితో ఇంగ్లండ్ జట్టు ప్రకటన**

**యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్, పేసర్ జోష్ టంగ్‌లకు తొలిసారిగా చోటు**

**గాయం నుంచి కోలుకుని జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన జోఫ్రా ఆర్చర్**

**కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్.. జట్టులో రూట్, బట్లర్ వంటి సీనియర్లు**

**గాయాల కారణంగా బ్రైడన్ కార్స్, జేమీ ఓవర్టన్‌లకు విశ్రాంతి**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెలలో భారత్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇంగ్లండ్ తమ జట్టును ప్రకటించింది. 16 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో ఓ కొత్త ఆటగాడికి తొలిసారిగా అవకాశం కల్పించారు. ససెక్స్ యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్ ను ఈ సిరీస్ కు ఎంపిక చేశారు. టెస్టుల్లో రాణించిన ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్‌కు కూడా తొలిసారిగా వన్డే జట్టు నుంచి పిలుపు అందింది. మరోవైపు, స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తిరిగి 50 ఓవర్ల జట్టులోకి రావడం ఇంగ్లండ్‌కు బలాన్నిచ్చింది.

2027 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఇంగ్లండ్ జట్టును ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 21 ఏళ్ల లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన జేమ్స్ కోల్స్‌ను దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తుండటంతో జట్టులోకి తీసుకున్నారు. అతనితో పాటు లియామ్ డాసన్‌ను కూడా ఎంపిక చేయడం ద్వారా స్పిన్ బౌలింగ్ వనరులను పటిష్టం చేసుకోవాలని ఇంగ్లండ్ భావిస్తోంది. టెస్టుల్లో మంచి ప్రదర్శన కనబర్చినందుకు జోష్ టంగ్‌కు వన్డేల్లో అవకాశం దక్కింది. గాయాల నుంచి కోలుకున్న గస్ అట్కిన్‌సన్, సాకిబ్ మహమూద్ కూడా తిరిగి జట్టులో చేరారు. గాయాల కారణంగా బ్రైడన్ కార్స్, జేమీ ఓవర్టన్ ఈ సిరీస్‌కు దూరమయ్యారు. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న ఈ జట్టులో జోస్ బట్లర్, జో రూట్, బెన్ డకెట్ వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు ఉన్నారు. మరోవైపు, ఈ సిరీస్ కోసం భారత్ పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి కీలక ఆటగాళ్లు ఆడనున్నారు. జులై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుండగా, 16న కార్డిఫ్, 19న లార్డ్స్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు జరుగుతాయి.

**ఇంగ్లండ్ వన్డే జట్టు:**
హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జో రూట్, విల్ జాక్స్, బెన్ డకెట్, జోస్ బట్లర్, జాకబ్ బెథెల్, శామ్ కరన్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్‌సన్, టామ్ బాంటన్, జేమ్స్ కోల్స్, లియామ్ డాసన్, సాకిబ్ మహమూద్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

# భారత్‌ను ఓడించడం మా వల్ల కాదు.. టీమిండియాపై పాక్ హెడ్ కోచ్ ప్రశంసలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైట్ బాల్ క్రికెట్‌లో భారత జట్టుకి తిరుగులేదని, ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత పవర్‌ఫుల్ జట్టు టీమిండియా అంటూ పాకిస్థాన్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ మైక్ హెస్సన్ ప్రశంసల జల్లు కురిపించాడు. పాకిస్థాన్ మాత్రమే కాకుండా ప్రపంచంలోని ప్రతీ జట్టు ఇండియాని ఓడించడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతుందని ఆయన కొనియాడాడు. ఇటీవల పాకిస్థాన్ జట్టు ప్రదర్శనలపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ మైక్ హెస్సన్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

**పాకిస్థాన్ కోచ్ మైక్ హెస్సన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్:**
పాక్ జట్టుపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ మైక్ హెస్సన్ మాట్లాడుతూ.. గతేడాది ఆసియా కప్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లు మినహా మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లో మేం గెలిచాం.. వాస్తవం ఏంటంటే ప్రస్తుతం ప్రపంచంలోని ఏ జట్టైనా భారత్‌ను ఓడించడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. కేవలం పాక్ మాత్రమే కాదు.. ప్రతి జట్టూ ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోందన్నాడు. తప్పో ఒప్పో పక్కన పెడితే భారత్‌తో ఆడేటప్పుడు పాకిస్థాన్ ప్రదర్శన ఎలా ఉందన్న దాని ఆధారంగానే మా జట్టును అంచనా వేస్తుంటారు. పాక్ పెద్ద టోర్నీల నాకౌట్ దశల్లో నిలకడగా చోటు దక్కించుకునే జట్టుగా ఎదగాలంటే, కేవలం భారత్ గురించే కాకుండా అన్ని జట్లపైనా క్రమం తప్పకుండా విజయాలు సాధించాల్సి ఉంది.

**భారత్ వర్సెస్ పాక్ హెడ్ టు హెడ్ రికార్డులు:**
ఆసియా కప్ 2025 టోర్నీలో భారత్‌తో ఫైనల్‌తో సహా మూడు మ్యాచ్‌లు ఆడిన పాకిస్థాన్.. ఈ మూడింటిలోనూ ఘోర ఓటమిపాలైంది. అలాగే ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో దాయాదీ దేశాలు ఒకసారి తలపడగా అక్కడ కూడా భారత్‌నే విజయం సాధించింది. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో ఓడినప్పటికీ, ఆ తర్వాత జరిగిన వరుసగా మూడు మెగా టోర్నీల్లో (ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025, ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024, 2026) భారత్ విజేతగా నిలిచి వైట్ బాల్ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

**ఇంగ్లాండ్ సిరీస్‌పై భారత్ కన్ను:**
టీ20 ఫార్మాట్‌లో వరుసగా 16 ద్వైపాక్షిక సిరీస్‌లు గెలిచిన రికార్డు ఉన్న భారత్‌కు.. ఇటీవలే పసికూన ఐర్లాండ్ చేతిలో రెండు టీ20ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయి ఊహించని షాక్ తగిలింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న ఇండియన్ టీమ్ ఆ ఓటమి నుంచి తేరుకుని తిరిగి పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఐదు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, రెండో టీ20 మ్యాచ్ రేపు (శనివారం) జరగనుంది.

# సౌతాఫ్రికాని ఓడించిన ఇంగ్లాండ్.. ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో బ్లాక్‌బస్టర్ పోరు



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల టీ20 వరల్డ్ కప్ రెండో సెమీఫైనల్లో ఇంగ్లాండ్ జట్టు అద్భుత విజయం సాధించింది. గురువారం (జులై 2న) కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో సౌతాఫ్రికాపై 40 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్లోకి దూసుకెళ్లింది. గత 2023 టీ20 వరల్డ్ కప్, 2025 వన్డే వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌లో సౌతాఫ్రికా చేతిలో ఎదురైన పరాజయాలకు ఇంగ్లాండ్ ఈ విజయంతో ప్రతీకారం తీర్చుకుంది. జూలై 5న లార్డ్స్ మైదానంలో జరగబోయే ప్రతిష్టాత్మక ఫైనల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో ఇంగ్లాండ్ తలపడనుంది.

**ఇంగ్లాండ్ రికార్డు భాగస్వామ్యం:**
టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌కు ఆరంభంలో గట్టి షాక్‌లు తగిలాయి. సౌతాఫ్రికా బౌలర్లు మరిజానే కాప్, షబ్నిమ్ ఇస్మాయిల్ ధాటికి పవర్‌ప్లే ముగిసేసరికి ఇంగ్లాండ్ 22 రన్స్ కే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో ఇస్మాయిల్.. అమీ జోన్స్‌ను అవుట్ చేయడంతో మహిళల టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే 50 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించింది. ఈ దశలో గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన కెప్టెన్ నాట్ సివర్-బ్రంట్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో 75 పరుగులు) , మాజీ కెప్టెన్ హీథర్ నైట్ (47 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్‌తో 58 పరుగులు)తో కలిసి ఇన్నింగ్స్‌ను అద్భుతంగా నిర్మించింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 133 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మహిళల టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ చరిత్రలోనే ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం.

**చేతులెత్తేసిన సౌతాఫ్రికా బ్యాటర్లు:**
170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు లారా వోల్వార్డ్ (17), తజ్మిన్ బ్రిట్స్ (51) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. మొదటి వికెట్‌కు 43 పరుగులు జోడించిన తర్వాత వోల్వార్డ్‌ను లిన్సే స్మిత్ అవుట్ చేసి బ్రేక్ త్రూ ఇచ్చింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో సౌతాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టారు. చార్లీ డీన్ ప్రమాదకరమైన బ్రిట్స్, మరిజానే కాప్‌లను అవుట్ చేయగా, లారెన్ బెల్, ఫ్రేయా కెంప్, సోఫీ ఎక్లెస్టోన్ తలో వికెట్ తీసి సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశారు. సౌతాఫ్రికా జట్టులో బ్రిట్స్ (51) మినహా మరెవ్వరూ రాణించలేకపోయారు. దీంతో దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 130 పరుగులకే పరిమితమై, 40 రన్స్ తేడాతో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. టోర్నీలో ఇప్పటి వరకు ఓటమి ఎరుగని ఆస్ట్రేలియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్లు ఇప్పుడు ట్రోఫీ కోసం ఫైనల్లో పోటీపడనున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965